VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : ఆదివారం 14.06.2026

సంపుటి : 08 సంచిక : 05 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



సింగరేణిలో బొగ్గు మాయం ఆరోపణలు.. సమగ్ర విచారణ జరిపించాలి: సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి లేఖ

# భారీ వర్షాలపై సీఎం హైఅలర్ట్ ఆదేశాలు

## హైదరాబాద్‌లో అప్రమత్తంగా ఉండాలని సూచనలు

- పోలీసు, ట్రాఫిక్, మున్సిపల్ శాఖల సమన్వయానికి ఆదేశం
- రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాల్లో ముందస్తు చర్యలు
- హైడ్రా, విద్యుత్, వాటర్‌బోర్డు అప్రమత్తంగా ఉండాలి
- నగరవాసులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి
- శంషాబాద్ వద్ద హైవేపై నిలిచిన వర్షపు నీరు
- షాద్‌నగర్ జాతీయ రహదారిపై వరద నీటి ముప్పు
- వర్ష ప్రభావిత ప్రాంతాల్లో డీజీపీ పర్యటన
- కీలక జంక్షన్లలో అదనపు పోలీసు బలగాల మోహరింపు



**హైదరాబాద్ వెలుతురు జూన్ 13:**

రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరం మరియు క్యూర్ (HYDRAA/CORE Urban Region) పరిధిలోని ప్రాంతాల్లో హైఅలర్ట్‌గా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

▶ మిగతా 2లో

### హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్



- రాబోయే ముప్పును ముందే అంచనా వేసే స్థాయికి వైద్య రంగం
- ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాదు

### భారీ వర్షాల నేపథ్యంలో ఆర్అండ్‌బి అధికారులను అలెర్ట్ చేసిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



- పై స్థాయి నుండి కింద స్థాయి వరకు గల ఆర్అండ్‌బి ఇంజనీర్లు అందరు క్షేత్ర స్థాయిలో ఉండాలి



### మోదీ 12 ఏళ్ల పాలనా స్ఫూర్తితో...

- చీపురు పట్టి ఊడ్చి....పైపుతో నీళ్లు చల్లి...
- క్లాస్ రూం ను అద్దంలా మార్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- సిరిసిల్ల కుసుమ రామయ్య జడ్పీహెచ్ఎస్ లో "స్వచ్ఛ పాఠశాల" నిర్వహించిన కేంద్ర మంత్రి
- బండి సంజయ్ పిలుపుతో కరీంనగర్ ఎంపీ సెగ్మెంట్ పరిధిలో స్కూళ్లను శుభ్రం చేస్తున్న కార్యకర్తలు, టీచర్లు, విద్యార్థులు

## SIRతో బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఓట్ల చోరీకి కుట్ర



- సీటు చోరీకి మధ్యప్రదేశ్ నిదర్శనం..
- నీట్ లీకులతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం
- తెలంగాణకు కేంద్రం సవతి తల్లి ప్రేమ
- తుమ్మిడిహెట్టికి సహకరించాలి: మంత్రి జూపల్లి కృష్ణారావు

## వీబీజీ రాంజీ స్కీంపై కేంద్రానికి నిరసన లేఖ: మంత్రి సీతక్క



**హైదరాబాద్, వెలుతురు జూన్ 13:**

కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి అమలు చేయాలని ప్రతిపాదించిన వీ బీ జీ రాంజీ స్కీంపై తెలంగాణ ప్రభుత్వం తన నిరసనను అధికారికంగా తెలియజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క తెలిపారు.వీబీజీ రాంజీ స్కీంను వ్యతిరేకిస్తూ తెలంగాణ శాసనసభ ఇప్పటికే తీర్మానం చేసిన విషయం తెలిసిందే. జూలై 1 నుంచి కొత్త విధానాన్ని అమలు చేయాలంటూ కేంద్రం రాష్ట్రాలపై ఒత్తిడి తీసుకొస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాలను, అభ్యంతరాలను కేంద్రానికి తెలియజేయాలని నిర్ణయించారు. అనుగుణంగా నిరసన లేఖను రాయనున్నట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు. లేఖలో పొందుపరచాల్సిన అంశాలపై జ్యోతి రావు పూలే ప్రజాభవన్‌లో మంత్రి సీతక్క శని వారం నాడు సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిషోర్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జాయింట్ కమిషనర్ నరసింహులు తదితర అధికారులు పాల్గొన్నారు.

▶ మిగతా 9లో

## ఉపాధి హామీ కూలీలతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్ వెలుతురు జూన్ 13:**

హుస్నాబాద్ నుండి కరీంనగర్‌కు వెళ్తున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మార్గమధ్యంలో ఉపాధి హామీ పథకం కింద పనులు నిర్వహిస్తున్న కూలీలను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఉపాధి హామీ పనుల పురోగతి, పనుల నిర్వహణ విధానం, వేతనాల చెల్లింపులు, పని పరిస్థితులు తదితర అంశాలపై కూలీలతో మాట్లాడారు. పనులు చేస్తున్న ప్రదేశాలను పరిశీలించిన మంత్రి, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు.ఉపాధి హామీ పథకం గ్రామీణ పేద కుటుంబాలకు ఉపాధి కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం కూలీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పథకం అమలుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.




### గూడెంగుట్ట శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించిన మంత్రులు

**మంచిర్యాల వెలుతురు జూన్ 13:**

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారి ఆధ్వర్యంలో మంచిర్యాల నియోజకవర్గంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గూడెంగుట్ట శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర ్వహించ బ డింది. దాదాపు రూ.70 కోట్ల వ్యయంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేయనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

## అస్సాంలో ఘోర విమాన ప్రమాదం



- రన్‌వేపై కూలిన వాయుసేన విమానం.. ఐదుగురు మృతి
- జోర్హాట్ ఎయిర్ బేస్‌లో హై అలర్ట్
- ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశం
- వాయుసేన నమ్మకమైన 'ప్రధాన విమానం'
- సరిహద్దుల్లో రక్షణ సామాగ్రి రవాణాకు కీలకం
- జోర్హాట్ స్థావరానికి శాపంగా మారిన విమాన ప్రమాదాలు

## మోదీ గారి 12 ఏళ్లలో భారతదేశ దిశ దశ మారింది

- అదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్

**అదిలాబాద్, వెలుతురు జూన్ 13:**



భారతదేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ, ప్రపంచ దేశాల సరసన అగ్రగామిగా నిలబెట్టిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి దక్కుతుందని , 12 సంవత్సరాల అద్భుత పరిపాలన, దేశ ప్రగతి ప్రజా సేవ లక్ష్యంగా ప్రధాని మోదీ పనిచేస్తూ దేశ దిశ దశ మార్చారని అదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గొడం నగేష్ , శాసనసభ్యులు పాయల్ శంకర్ లు అన్నారు.

## అరవింద్ మాటలు చూస్తేనే అర్థం అవుతుంది కదా



- రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి కింద మీద చేసి అయిన తెలంగాణ లో అధికారంలో వస్తామని చెప్పకనే చెప్పున్నారు
- బీజేపీ జై శ్రీరామ్ పేరుతో మూడు సార్లు గెలిచింది

## టీవీకే జిరాక్స్ కాపీలా బీజేపీ

- స్టాలిన్ తీవ్ర విమర్శలు విజయ్‌పై ఘాటు వ్యాఖ్యలు చేసిన డీఎంకే అధ్యక్షుడు
- టీవీకేపై విరుచుకుపడిన ఎంకే స్టాలిన్
- మహిళల భద్రత అంశంపై విజయ్‌ను నిలదీత
- టీవీకే కార్యకర్తలపై వస్తున్న ఆరోపణలను ప్రస్తావించిన డీఎంకే అధినేత
- ఎమ్మెల్యేలను ఆకర్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ విమర్శలు



- సొంత పార్టీ కార్యకర్తలపై విజయ్‌కు నమ్మకం లేదన్న స్టాలిన్

## అమెరికాపై భారత్ తీవ్ర ఆగ్రహం



- ఒమన్ తీర ఘటనపై అసహనం
- మార్కో రూబియోతో జైశంకర్ ఫోన్ సంభాషణ

## ఫ్రాన్స్, స్లోవేకియా పర్యటనకు మోదీ

- జీ7 సదస్సులో పాల్గొనున్న ప్రధాని..
- ప్రపంచ నేతలతో ద్వైపాక్షిక భేటీలు
- వారం రోజుల విదేశీ పర్యటనకు బయలుదేరిన ప్రధాని
- ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌తో కీలక సమావేశం
- ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపై సమీక్ష



- ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చించే అవకాశం
- స్లోవేకియా పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం

# హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్

- 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏఐ ఇన్ హెల్త్ కేర్'లో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 13:**

హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్ ను ప్రపంచపటంలో నిలపాలన్నదే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా, ఆవిష్కర్తలను ప్రోత్సహించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'ఎకో సిస్టం'ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైటెక్ సిటీలోని యశోదా ఆసుపత్రిలో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏఐ ఇన్ హెల్త్ కేర్'ను ఆయన శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఏఐ ఏదో ఒక రంగానికి మాత్రమే పరిమితం కాలేదని, అన్నింటికి విస్తరించి మానవ జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ముఖ్యంగా కేవలం వ్యాధి నిర్ధారణ దశకే పరిమితం కాకుండా... రాబోయే ముప్పును ముందే అంచనా వేసే స్థాయికి వైద్య రంగాన్ని చేర్చిందన్నారు. అలాగే... ప్రతి రోగికి ప్రత్యేక వ్యక్తిగత వైద్య సంరక్షణను అందించే సాధనంగా మారిందన్నారు. ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాలేదని స్పష్టం చేశారు. సాంకేతికతకు మానవీయ విలువల్ని జోడించినప్పుడే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల జనాభా పెరుగుతున్న తరుణంలో... క్యాన్సర్, గుండెజబ్బులు వంటి క్లిష్టమైన ఆరోగ్య సవాళ్లకు సరికొత్త పరిష్కారాలు, ఆవిష్కరణలు రావాల్సిన అవసరముందన్నారు. అందుకు... హైదరాబాద్ ను ఒక ల్యాంచ్ ప్యాడ్ తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. అకాడెమియా, ఇండస్ట్రీ మధ్య బలమైన అనుసంధానం ఏర్పడినప్పుడే ఏఐ హెల్త్ కేర్ ఆవిష్కరణలు సామాన్యుడికి అందుతాయన్నారు. భవిష్యత్తు సవాళ్లను ముందే ఎదుర్కొనేలా... కొత్త ఆలోచనల్ని ప్రోత్సహించే ఇన్నోవేషన్ ఆధారిత వ్యూహాలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఆవిష్కరణలు కేవలం ల్యాబ్‌లకే పరిమితం కాకుండా, సమాజంలో నిజమైన మార్పును తీసుకొచ్చేలా ఆవిష్కర్తలు, స్టార్టప్స్ కు మార్గనిర్దేశం చేస్తున్నామన్నారు. పరిశోధనలకు ఊతమిచ్చేలా దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత డేటా ఎక్స్ ఛేంజ్ ను ప్రారంభించామన్నారు. లైఫ్ సైన్సెస్ లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు 'వన్ బయో' పేరిట ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామన్నారు. స్టార్టప్స్ కు అండగా నిలిచేందుకు 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్'ను ఏర్పాటు చేశామని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. హైదరాబాద్ వేదికగా గ్లోబల్ హెల్త్ టెక్ విప్లవంలో భాగస్వామ్యం కావాలని నిపుణులు, ఆవిష్కర్తలు, కంపెనీలు, స్టార్టప్స్ ను సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

## భారీ వర్షాలపై సీఎం...

(మొదటి పేజీ తరువాయి)

వర్షాల పరిస్థితిపై ముఖ్యమంత్రి సీఎస్, డీజీపీ, క్యూర్ స్పెషల్ సీఎస్‌తో సమీక్ష నిర్వహించారు. పోలీసు, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, రెవెన్యూ, మున్సిపల్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నగరంలోని లోతట్టు ప్రాంతాలు, నీరు నిలిచే రహదారులు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక బృందాలను మోహరించాలని సూచించారు.హైడ్రా, విద్యుత్ శాఖ, వాటర్‌బోర్డు, విపత్తు నిర్వహణ విభాగాలు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలని సీఎం స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టేలా యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.శనివారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో సాధారణ జనజీవనం కొంతమేర ప్రభావితమైంది. శంషాబాద్ సమీపంలోని బెంగళూరు జాతీయ రహదారిపై భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సంబంధిత సిబ్బంది మోటార్ల సాయంతో నీటిని తొలగించే పనులు చేపట్టారు.ఇదే సమయంలో షాద్‌నగర్ పరిసర ప్రాంతాల్లోనూ భారీ వర్షాల కారణంగా జాతీయ రహదారిపై వరద నీరు నిలిచింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు అక్కడ కూడా సహాయక చర్యలు వేగవంతం చేశారు.మరోవైపు, వర్ష ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యక్షంగా పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. మల్కంపేట చెరువు, టోలిచౌకీ ప్రాంతాలను సందర్శించి వర్షపు నీటి ప్రవాహం, ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేశారు.వర్షాల నేపథ్యంలో కీలక జంక్షన్లు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే ప్రాంతాల్లో అదనపు పోలీసు సిబ్బందిని మోహరించాలని డీజీపీ ఆదేశించారు. హైదరాబాద్‌తో పాటు వర్ష ప్రభావిత జిల్లాల ఎస్పీలు, కమిషనరేట్ల అధికారులు పూర్తిస్థాయి అప్రమత్తతతో పనిచేయాలని సూచించారు.రానున్న రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలపై దృష్టి సారించింది. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని, అధికారుల సూచనలను పాటించాలని యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

## మోదీ 12 ఏళ్ల పాలనా స్ఫూర్తితో...

- ఈసారి టెన్త్ విద్యార్థులకు మళ్లీ పరీక్ష ఫీజు చెల్లిస్తానని హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి
- టెన్త్ విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లు అందిస్తానని ప్రకటన

**కరీంనగర్ వెలుతురు జూన్ 13:**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ''స్వచ్ఛ పాఠశాల'' కార్యకర్తగా మారారు. ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకుని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను ''స్వచ్ఛ పాఠశాల'' పేరుతో శుభ్రం చేసే పనికి శ్రీకారం చుట్టారు. తన పార్లమెంట్ పరిధిలోని ప్రతి పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలంటూ బండి సంజయ్ ఇచ్చిన పిలుపు మేరకు ఈరోజు నియోజకవర్గ వ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలంతా కలిసి తమ తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రం చేశారు. సొంతంగా చీపురు తెచ్చుకుని, క్లాత్, మగ్గు, బకెట్ తెచ్చుకుని తరగతి గదులను క్లీన్ చేశారు. అందులో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ సైతం ఈరోజు ఉదయం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విచ్చేశారు. స్వయంగా చీపురు పట్టి ఊడ్చారు. పైపు నీళ్లతో తరగతి గదిని క్లీన్ చేశారు. ఆ తరువాత శుభ్రంగా తుడిచారు. విద్యార్థులు కూర్చునే టేబుల్ కింద దుమ్ము ధూలి లేకుండా క్లీన్ చేశారు. తరగతి గదిలోని మూలమూలకు వెళ్లి చీపురు పట్టి ఊడ్చారు. నీళ్లతో క్లీన్ చేశారు. తరగతి ఆవరణలోనూ నీళ్లు చల్లారు. నీళ్లు చల్లి తరగతి గదులను పరిశుభ్రం చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్. కేంద్ర మంత్రి పిలుపు మేరకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ''స్వచ్ఛ పాఠశాల'' పేరుతో తరగతి గదులను బీజేపీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలు శుభ్రం చేశారు. నీళ్లతో క్లీన్ చేశారు. చాలా చోట్ల కార్యకర్తలు సొంతంగా చీపురు, మగ్గు, బకెట్, క్లాత్ తీసుకొచ్చి శుభ్రం చేయడం కన్పించింది.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే...మోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా వివిధ వర్గాలను కలుస్తున్నాం. అనేక సభలు, సమ్మేళనాలు నిర్వహిస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా ''స్వచ్ఛ పాఠశాల'' పేరుతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని పాఠశాలలను పరిశుభ్రం చేయాలని నిర్ణయించాం. రాజకీయాలకు అతీతంగా మన పాఠశాలను మనం శుభ్రం చేసుకుందామని కోరాం. స్ఫూర్తిదాయకమైన సేవా కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరిస్తున్నారు. టీచర్లు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు కూడా పాల్గొని తమ వంతు బాధ్యతను నెరవేరుస్తున్నారు. నిన్ననే ఏ స్కూల్ ను ఎవరెవరు శుభ్రం చేయాలనే విషయంపై నిన్ననే ''టిఫిన్ బైఠక్'' నిర్వహించాం. అందులో భాగంగా ఈరోజు పాఠశాలలను శుభ్రం చేస్తున్నాం. దీంతోపాటు పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ ఎల్లుండి గ్రామాలు, మండలాల వారీగా ర్యాలీలు కూడా నిర్వహించబోతున్నాం. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలన్నది నా సంకల్పం. అందులో భాగంగానే ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ చదివే విద్యార్థులందరికీ ఈసారి కూడా సైకిళ్లు అందించబోతున్నాం. టెన్త్ విద్యార్థులందరికీ నా వేతనం నుండి పరీక్ష ఫీజు చెల్లిస్తా. పాఠశాల అభ్యున్నతి కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతా. పాఠశాలలో నెలకొన్న సమస్యలపైనా త్వరలోనే సమీక్ష చేస్తా. పరిష్కారానికి చర్యలు తీసుకుంటా.



# SIRతో బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఓట్ల చోరీకి కుట్ర

**ఆదిలాబాద్, వెలుతురు జూన్ 13:**

ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమవడమే కాకుండా, నేడు రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులపైనా దాడులు జరుగుతున్నాయని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ SIR, నీట్ లీకులు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, తెలంగాణకు కేంద్రం చేస్తున్న అన్యాయం వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు. SIR పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించే కుట్ర జరుగుతోందని మంత్రి ధ్వజమెత్తారు. రాజకీయ లాభాపేక్షతో పేదలు, దళితులు, గిరిజనులు, బీసీలు, మైనారిటీల ఓటు హక్కులను హరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు అని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను ఏకపక్షంగా తిరస్కరించడం 'సీటు చోరీ'కి నిదర్శనమని జూపల్లి పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థల దుర్వినియోగానికి నిదర్శనమని మండిపడ్డారు. దేశంలో నీట్ పేపర్ లీకులతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. వరుసగా పరీక్షల పేపర్లు లీకవుతున్నా ప్రధాని మోదీ మౌనంగా ఉండటం దురదృష్టకరమన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఖాళీగా ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను కూడా భర్తీ చేయడం లేదని విమర్శించారు.పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెరుగుదలతో సామాన్య ప్రజల జీవనం భారంగా మారిందని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ మిత్రులకు కట్టబెడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, ఓటు హక్కును కాపాడటంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ సవతి తల్లి ప్రేమనే చూపిస్తోందని జూపల్లి విమర్శించారు. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ తెలంగాణకు రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. విభజన చట్ట హామీలు, మెట్రో విస్తరణ, రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందని ఆరోపించారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని మంత్రి తెలిపారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, రూ.500 గ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ వంటి హామీలను అమలు చేస్తూ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తోందన్నారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపడుతున్నామని చెప్పారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని, తుమ్మిడిహట్టి బ్యారేజ్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని మంత్రి కోరారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్వయంగా ప్రధానమంత్రిని కలిసి ఈ అంశాన్ని ప్రస్తావించారని గుర్తుచేశారు. తుమ్మిడిహట్టి పూర్తయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు.కుంటాల, పొచ్చెర జలపాతాలు, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ను అంతర్జాతీయ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ఆర్అండ్‌బి అధికారులను అలెర్ట్ చేసిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

- భారీ వర్షాల వల్ల వరదలతో ముందుగా ఇబ్బందిగా మారే రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి
- ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలి
- రెవెన్యూ, పోలీసు, ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్ ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలి
- శని, ఆదివారాలు ఏమి లేవు... అందరు ఫీల్డ్ లో ఉండాల్సిందే
- హైదరాబాద్ ఎర్రమంజిల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ సెంటర్ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా మానిటరింగ్ చేయాలి
- రాష్ట్రంలోని అన్ని ఆర్ అండ్ బి డివిజన్ల వారిగా వివరాలు ఎప్పటికప్పుడు నాకు తెలపాలి*
- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూన్ 13::**

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ ఆర్ అండ్ బి అధికారులను అలెర్ట్ చేశారు.సి.ఈ నుండి ఏ.ఈ వరకు,పై స్థాయి నుండి కింద స్థాయి వరకు గల ఆర్ అండ్ బి ఇంజనీర్లు అందరు క్షేత్ర స్థాయిలో ఉండాలనీ తేల్చి చెప్పారు.

భారీ వర్షాల వల్ల..వరదలతో ముందుగా ఇబ్బందిగా మారే రోడ్లు,బ్రిడ్జిలు, కల్వర్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలనీ,ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు.రోడ్లు కోతకు గురైతే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.రెవెన్యూ,పోలీసు,ఎలక్ట్రిసిటీ,ఇరిగేషన్ ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలనీ సూచించారు.శని,ఆదివారాలు అని సెలవులు ఏమి లేవనీ...అత్యవసరం అయితే తప్పా అందరు ఫీల్డ్ లో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు.హైదరాబాద్ ఎర్రమంజిల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ సెంటర్ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు,బ్రిడ్జిల పరిస్థితి మానిటరింగ్ చేయాలనీ,రాష్ట్రంలోని అన్ని ఆర్ అండ్ బి డివిజన్ల వారిగా వివరాలు ఎప్పటికప్పుడు తనకు తెలపాలనీ ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.

# అస్సాంలో ఘోర విమాన ప్రమాదం

- గతంలోనూ 'ఏఎన్-32' విషాదం
- మార్చిలోనే కూలిన సుఖోయ్ యుద్ధ విమానం
- మారే వాతావరణం.. పైలట్లకు నిత్య సవాళ్లు

**అస్సాం వెలుతురు జూన్ 13:**



అస్సాంలోని జోర్హాట్ వాయుసేన స్థావరంలో శనివారం ఒక భారీ ప్రమాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన 'ఏఎన్-32' రవాణా విమానం ల్యాండ్ అవుతున్న సమయంలో ఒక్కసారిగా అదుపుతప్పి రన్‌వే పక్కనే కూలిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే విమానంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి, క్షణాల్లో విమానం అంతటా వ్యాపించాయి. ఈ దుర్ఘటనలో విమానంలో ఉన్న ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన వారిలో ఇద్దరు ఉన్నతాధికారులు, ముగ్గురు వైమానిక దళ సిబ్బంది ఉన్నట్లు జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి.ఈ ఘోర ప్రమాదం జరిగిన వెంటనే జోర్హాట్ సైనిక క్షేత్రం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. విమానం కూలిన వెంటనే బేస్‌లో సైరన్లు మోగాయి. వాయుసేనకు చెందిన ప్రత్యేక అగ్నిమాపక సిబ్బంది, రక్షణ బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి. విమానాన్ని చుట్టుముట్టిన భారీ మంటలను అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది గంటల తరబడి శ్రమించాల్సి వచ్చింది. విమానంలో ఇంధనం ఎక్కువగా ఉండటం వల్ల మంటలు వేగంగా వ్యాపించాయని, చాలా సేపు పోరాడిన తర్వాతే పరిస్థితి అదుపులోకి వచ్చిందని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. గాయపడిన వ్యక్తిని వెంటనే సమీపంలోని సైనిక ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు.ప్రమాద తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న భారత వైమానిక దళం ఈ ఘటనపై తక్షణమే ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. సాంకేతిక లోపం వల్ల ఈ ప్రమాదం జరిగిందా, లేక ల్యాండింగ్ సమయంలో పైలట్ నియంత్రణ కోల్పోవడానికి వాతావరణం ఏమైనా కారణమా అనే కోణంలో విచారణ జరపనున్నారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకోవడానికి రక్షణ రంగ నిపుణులతో కూడిన ప్రత్యేక బృందం జోర్హాట్ చేరుకుంది. విమానానికి సంబంధించిన బ్లాక్ బాక్స్‌ను స్వాధీనం చేసుకుని, ల్యాండింగ్ సమయంలో పైలట్లకు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ కు మధ్య జరిగిన సంభాషణలను విశ్లేషిస్తున్నారు.భారత రక్షణ రంగంలో ఈ ఏఎన్-32 ట్విన్ ఇంజిన్ రవాణా విమానానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు మరియు సుదీర్ఘ చరిత్ర ఉంది. సోవియట్ యూనియన్ కాలంలో తయారైన ఈ విమానాలను ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రవాణా విభాగానికి 'ప్రధాన గుర్రం' లాగా (వర్క్ హార్స్) భావిస్తారు. దశాబ్దాలుగా ఇవి భారత సైన్యానికి ఎనలేని సేవలు అందిస్తున్నాయి. ఎలాంటి కఠిన వాతావరణ పరిస్థితులనైనా తట్టుకుని నిలబడటం ఈ విమానాల ప్రత్యేకత. ఎంతటి కొండ ప్రాంతాలైనా, విపరీతమైన వేడి లేదా చలి వాతావరణం ఉన్నా ఇవి సులభంగా దూసుకుపోగలవు.మన దేశంలోని క్లిష్టమైన ఉత్తర సరిహద్దులు, అలాగే ఈశాన్య రాష్ట్రాల్లోని పర్వత లోయల్లో సైనికులకు రక్షణ సామాగ్రిని చేరవేయడానికి వాయుసేన ఈ ఏఎన్-32 విమానాలనే ఎక్కువగా నమ్ముకుంటుంది. ప్రస్తుతం భారత వాయుసేన వద్ద ఇలాంటివి దాదాపు 100 విమానాలు సేవల్లో ఉన్నాయి. ఇది సుమారు 7.5 టన్నుల బరువున్న సరుకును లేదా పూర్తి ఆయుధాలతో ఉన్న 50 మంది సైనికులను మోసుకెళ్లగలదు. అలాగే అత్యవసర సమయాల్లో ఆపరేషన్ల కోసం దూకే 42 మంది పారాట్రూపర్లను కూడా ఇది మోయగలదు. రహదారులు సరిగా లేని మారుమూల సరిహద్దు గ్రామాలకు, పోస్టులకు రేషన్, మందుగుండు సామగ్రిని సకాలంలో అందించడంలో ఈ విమానాల పాత్ర ఎంతో కీలకం.అస్సాంలోని జోర్హాట్ ఎయిర్ బేస్‌కు వైమానిక ప్రమాదాలతో ఒక సుదీర్ఘమైన, బాధాకరమైన చరిత్ర ఉంది. ఈ ప్రాంతంలో గతంలోనూ పలుమార్లు ఘోర విమాన ప్రమాదాలు జరిగాయి. వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ ఎయిర్ బేస్ నుంచి బయలుదేరిన విమానాలు ప్రమాదాలకు గురికావడం వాయుసేనను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ప్రాంతంలో ఉన్న భౌగోళిక పరిస్థితులు, కొండల నడుమ ఉండే రన్‌వేలు ల్యాండింగ్, టేకాఫ్ సమయాల్లో పైలట్లకు నిరంతరం సవాలు విసురుతూనే ఉంటాయి.గతంలో 2019 లో కూడా సరిగ్గా ఇదే తరహా ఏఎన్-32 రవాణా విమానం ఇక్కడి నుంచే బయలుదేరి ఘోర ప్రమాదానికి గురైంది. అప్పట్లో జోర్హాట్ స్థావరం నుండి అరుణాచల్ ప్రదేశ్‌లోని మెచుకా రక్షణ కేంద్రానికి వెళ్తుండగా.. గాల్లోకి ఎగిరిన కేవలం 33 నిమిషాలకే ఆ విమానం రాడార్ల నుంచి అదృశ్యమయింది. దాదాపు వారం రోజుల పాటు ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ జరిపిన గాలింపు చర్యల తర్వాత అరుణాచల్ ప్రదేశ్‌లోని పారి కొండల్లో 12 వేల అడుగుల ఎత్తులో దాని శకలాలు లభ్యమయ్యాయి. ఆ ఘోర ప్రమాదంలో విమానంలో ప్రయాణిస్తున్న 13 మంది సైనికులు దుర్మరణం పాలయ్యారు.తాజాగా జరిగిన ఏఎన్-32 ప్రమాదానికి కొన్ని నెలల ముందే, అంటే 2026 మార్చి 5వ తేదీన అస్సాంలోనే మరో ప్రతిష్టాత్మక యుద్ధ విమానం ప్రమాదానికి గురైంది. జోర్హాట్ ఎయిర్ ఫోర్స్ స్థావరం నుంచే రాత్రి సమయ శిక్షణ (నైట్ ట్రైనింగ్) కోసం ఇద్దరు పైలట్లతో బయలుదేరిన 'సుఖోయ్ సూ-30ఎంకెఐ' ఫైటర్ జెట్ కార్బీ ఆంగ్లాంగ్ జిల్లాలోని కొండ ప్రాంతాల్లో కూలిపోయింది. సాంకేతిక లోపంతో జరిగిన ఆ ప్రమాదంలో దేశం ఇద్దరు ప్రతిభావంతులైన వాయుసేన పైలట్లను కోల్పోవాల్సి వచ్చింది.సరిహద్దు రాష్ట్రమైన అస్సాంతో పాటు ఈశాన్య భారత ప్రాంతాల్లో వాతావరణం చాలా వేగంగా మారిపోతుంటుంది.

దట్టమైన పొగమంచు, అకస్మాత్తుగా కురిసే భారీ వర్షాలు, కొండల మధ్య వీచే బలమైన గాలుల వల్ల వాయుసేన పైలట్లు విమానాలు నడిపేటప్పుడు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఈ వరుస ప్రమాదాల వెనుక కేవలం వాతావరణ ప్రతికూలతలే కారణమా, లేక విమానాల్లో పాతబడిపోతున్న సాంకేతిక లోపాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో రక్షణ శాఖ నిపుణులు తీవ్రంగా అధ్యయనం చేస్తున్నారు. ప్రస్తుత ఏఎన్-32 ప్రమాదంపై పూర్తి వివరాలు సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం



- రిమ్మ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం
- ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం
- లైబ్రరీకి రూ.10 లక్షల మంజూరు
- మంత్రి జూపల్లి కృష్ణారావు

**సిరికొండ వెలుతురు జూన్ 13:**

ఆదివాసీల ఆచార సంప్రదాయాలు దేశానికి ఆదర్శమని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం సిరికొండ మండలం రిమ్మ గ్రామంలో పర్యటించిన ఆయన నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహాలను ప్రారంభించారు.లబ్ధిదారులు నైతం కవిత–సోము, తొడసం సుదర్శన్–మధుబాయి, సీతాబాయి–దేవురావు కుటుంబాలకు చెందిన నూతన గృహాలను మంత్రి పరిశీలించి, ప్రభుత్వ సహాయంతో సొంతింటి కల నెరవేరడం సంతోషకరమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, రిమ్మ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇప్పటి వరకు 69 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంకా అర్హులైన కుటుంబాలకు అదనపు గృహాలను మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గ్రామానికి అవసరమైన బీటీ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**విద్యాభివృద్ధికి ప్రాధాన్యం**

గ్రామంలో గ్రంథాలయ నిర్మాణం కోసం రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని మంత్రి ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.అర్హులైన ప్రతి కుటుంబానికి కొత్త రేషన్ కార్డులు, సామాజిక భద్రతా పెన్షన్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్షకు తావులేదని మంత్రి స్పష్టం చేశారు.

**మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రిమ్మ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని చెప్పారు. రోడ్లు, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం చిట్టచివరి లబ్ధిదారుడికి చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రజలందరూ సమష్టిగా సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, సర్పంచ్ పెందుర్ జంగుబాయి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు కొత్త దిశ చూపిన మహిళా వారోత్సవాలు

- ఆర్థిక స్వావలంబన నుంచి రాజకీయ నాయకత్వం వరకు మహిళలకు విస్తృత అవకాశాలు
- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించిన మహిళా వారోత్సవాలు విజయవంతం

**హైదరాబాద్, వెలుతురు జూన్ 13:**

మహిళలను సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా రాష్ట్ర అభివృద్ధికి చోదకశక్తులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన మహిళా వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 25 నుంచి 31 వరకు నిర్వహించిన ఈ వారోత్సవాలు మహిళల ఆర్థిక, సామాజిక, విద్యా, ఆరోగ్య, రాజకీయ సాధికారతకు కొత్త ఊపునిచ్చాయి.గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం సహాయక సంఘాల బలోపేతం, బాలికల్లో నాయకత్వ లక్షణాల పెంపు, మహిళల భద్రత, పారిశ్రామిక ప్రోత్సాహం, అక్షరాస్యత, బాల్య వివాహాల నిర్మూలన, చిన్నారుల సంక్షేమం వంటి విభిన్న అంశాలపై వారంరోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వేలాది కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, సెర్ప్, మెప్మా, అంగన్‌వాడీ వ్యవస్థ, వివిధ ప్రభుత్వ శాఖలు, స్వయం సహాయక సంఘాలు సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమాలు మహిళా సాధికారతను ప్రజా ఉద్యమంగా మార్చాయి.వారోత్సవాల ప్రారంభ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8 వేల ఇందిరా మహిళా శక్తి భవనాలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. గ్రామీణ మహిళల సమావేశాలు, శిక్షణలు, జీవనోపాధి కార్యకలాపాలు, సామాజిక చైతన్య కార్యక్రమాలకు ఈ భవనాలు కేంద్రాలుగా మారనున్నాయి. మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన యూనిఫాం చీరలను కూడా ఆవిష్కరించారు.మహిళలను ఉద్యోగాలు కోరుకునే స్థాయి నుంచి ఉపాధి కల్పించే స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక ఇంక్యుబేటర్ కార్యక్రమాలు, రుణమేళాలు, జీవనోపాధి యూనిట్ల ప్రారంభోత్సవాలు, మార్కెటింగ్ అవకాశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఖమ్మం జిల్లా మధిరలో



మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తొలి సౌర విద్యుత్ కేంద్రం ప్రారంభం మహిళల సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది.మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ హైదరాబాద్‌లో ఉద్యోగినుల కోసం సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, సఖి వన్ స్టాప్ సెంటర్‌ను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా POSH చట్టంపై అవగాహన కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలు నిర్వహించారు. "బాల్య వివాహం – బతుకు ఆగం" నినాదంతో గ్రామసభలు, ర్యాలీలు, కళాజాతాలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించి బాల్య వివాహాల నిర్మూలనపై విస్తృత చైతన్యం కల్పించారు.చిన్నారుల ఆరోగ్యం, పోషణకు ప్రాధాన్యతనిస్తూ "బలమైన బాల్యానికి 1000 మెట్లు" కార్యక్రమం నిర్వహించగా, అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతానికి రాష్ట్రవ్యాప్తంగా 50 కొత్త అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించి, మరో 27 భవనాలకు శంకుస్థాపనలు చేపట్టారు. "అమ్మ మాట – అంగన్‌వాడీ బాట" కార్యక్రమం ద్వారా చిన్నారులకు యూనిఫారాలు, విద్యారంభ ధృవపత్రాలు అందజేయడంతో పాటు "అమ్మకు అక్షరమాల" కార్యక్రమం ద్వారా అక్షరాస్యత సాధించిన మహిళలను సన్మానించారు.కిశోర బాలికల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు స్నేహ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మాక్ పార్లమెంట్‌లు, మాక్ అసెంబ్లీలు నిర్వహించారు. జిల్లా స్థాయిల్లో ప్రతిభ కనబరిచిన బాలికలతో హైదరాబాద్ జూబ్లీహాల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీ అసెంబ్లీ సమావేశాలను తలపించింది. ప్రజా సమస్యలపై చర్చలు, విధానాలపై అభిప్రాయాల వ్యక్తీకరణ, ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన ద్వారా బాలికలకు భవిష్యత్ నాయకత్వానికి అవసరమైన పునాది ఏర్పడింది.వారోత్సవాల ముగింపు సందర్భంగా హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన మహిళా శక్తి మహాసభ మహిళా సాధికారతకు ప్రతీకగా నిలిచింది. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు తమ ఐక్యత, సంకల్పాన్ని చాటిచెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సంఘాలకు కేటాయించిన 553 ఆర్టీసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. మహిళలు ప్రయాణికులుగా మాత్రమే కాకుండా బస్సుల యజమానులుగా ఎదిగేలా తీసుకొచ్చిన ఈ కార్యక్రమం మహిళా ఆర్థిక సాధికారతలో కీలక మైలురాయిగా నిలిచింది.అదే సభలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద రూ.500 కోట్ల ప్రోత్సాహకాన్ని విడుదల చేయడంతో పాటు, బస్సుల అద్దె చార్జీల కింద మండల మహిళా సమాఖ్యలకు రూ.20.34 కోట్ల చెక్కులను అందజేశారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం ద్వారా కుటుంబాలకు కలిగిన ఆర్థిక ప్రయోజనాలను ప్రతిబింబించేలా రూ.10,700 కోట్ల ఆదా వివరాలను వెల్లడించారు. మహిళా సంఘాల విజయగాథలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు "మహిళా ప్రగతి" మాసపత్రికను కూడా ఆవిష్కరించారు.మహిళలు వ్యవసాయం, సూక్ష్మ వ్యాపారాలు, సేవారంగం, పారిశ్రామిక రంగం, పునరుత్పాదక ఇంధన రంగం, ప్రజా నాయకత్వం వంటి అన్ని రంగాల్లో రాణించగలరని ఈ వారోత్సవాలు నిరూపించాయని మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. మహిళలు బలపడితే కుటుంబం బలపడుతుందని, కుటుంబం బలపడితే సమాజం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని ఆమె అన్నారు.మహిళా సాధికారతను ఒక కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా మార్చాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి మహిళా వారోత్సవాలు బలమైన పునాది వేశాయని మంత్రి సీతక్క తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపడుతుందని, తెలంగాణ మహిళలను దేశానికి ఆదర్శంగా నిలబెట్టే దిశగా కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు.మహిళా వారోత్సవాల విజయానికి కృషి చేసిన స్వయం సహాయక సంఘాల సభ్యులు, స్నేహ సంఘాల బాలికలు, అంగన్‌వాడీ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, యువత మరియు ప్రజలందరికీ మంత్రి సీతక్క ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సాధికారతను పరిపూర్ణం చేసేందుకు ఇదే ఒరవడితో పనిచేయాలని పిలుపునిచ్చారు.

# బత్తాయి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి కోమటిరెడ్డి

- నల్లగొండలో రాష్ట్ర సిట్రస్ సెమినార్-2026 ప్రారంభం
- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో కలిసి ప్రారంభించిన మంత్రి
- సిట్రస్ పంటల కేంద్రంగా నల్లగొండకు ప్రత్యేక గుర్తింపు
- రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని గుర్తు చేసిన కోమటిరెడ్డి
- స్వయంగా బత్తాయి సాగు చేసిన అనుభవం ఉందన్న మంత్రి

**నల్లగొండ వెలుతురు జూన్ 13:**



నల్లగొండలో నిర్వహించిన "రాష్ట్ర సిట్రస్ సెమినార్–2026"ను రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మేయర్ చైతన్య శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లా పేరు వినగానే ముందుగా గుర్తుకొచ్చేది బత్తాయి తోటలేనని అన్నారు. దశాబ్దాలుగా ప్రకృతి విపత్తులు, మార్కెట్ ఒడిదుడుకులను ఎదుర్కొంటూ రైతులు నల్లగొండను తెలంగాణలో సిట్రస్ పంటల ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దారని కొనియాడారు.తాను కూడా రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినేనని, ఒకప్పుడు స్వయంగా బత్తాయి సాగు చేసిన అనుభవం ఉందని మంత్రి పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొనే కష్టాలు, పెట్టుబడుల భారం, మార్కెట్ సమస్యలు తనకు వ్యక్తిగతంగా తెలుసని చెప్పారు.వ్యవసాయ రంగంలో నిజమైన మార్పు రావాలంటే పుస్తకాలలో ఉన్న శాస్త్రీయ పరిజ్ఞానం రైతుల పొలాల వరకు చేరాలని సూచించారు. ఆధునిక సాగు పద్ధతులు, నూతన సాంకేతికత, ఎగుమతి అవకాశాలపై ఈ సెమినార్‌లో జరుగుతున్న చర్చలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. బత్తాయి రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని, వారి సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు."రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుంది.. గ్రామం బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది" అని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెరిగేలా, వ్యవసాయం లాభసాటిగా మారేలా ప్రభుత్వం కృషి కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# జూన్ 17, 18 తేదీలలో నాగోల్‌లో 'లియాఫీ -1964' జాతీయ జనరల్ బాడీ సమావేశాలు

- దేశవ్యాప్తంగా తరలిరానున్న 3000 మంది ప్రతినిధులు
- పాలసీదారులు, ఏజెంట్ల ప్రయోజనాలే లక్ష్యంగా వ్యూహాల రచన

**హైదరాబాద్ వెలుతురు జూన్ 13:**



భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య (LIAFI–1964) ప్రతిష్టాత్మక జాతీయ జనరల్ బాడీ సమావేశాలు ఈ నెల 17, 18 తేదీలలో హైదరాబాద్‌లోని నాగోల్ గల 'శుభం కన్వెన్షన్ సెంటర్' లో నిర్వహించనున్నట్లు సమాఖ్య ప్రతినిధులు వెల్లడించారు. శనివారం శుభం ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమావేశానికి సంబంధించిన వివరాలను వారు అధికారికంగా ప్రకటించారు. ఈ రెండు రోజుల మహాసభల్లో దేశవ్యాప్తంగా ఉన్న 3000 మందికి పైగా సాధారణ మండలి సభ్యులు, జాతీయ కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర నాయకులు మరియు ప్రతినిధులు పాల్గొననున్నారు. వేగంగా మారుతున్న బీమా రంగం, ప్రస్తుత పరిణామాలు మరియు ఏజెంట్లు ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుందని నాయకత్వం పేర్కొంది.ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మాట్లాడుతూ... గత కార్యకలాపాలు, సభ్యత్వ వృద్ధి మరియు ఏజెంట్లు, పాలసీదారుల సమస్యలపై సంబంధిత అధికారులకు సమర్పించిన వినతుల నివేదికలను సభలో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.

భవిష్యత్తు కార్యాచరణకు సంబంధించి పలు కీలక తీర్మానాలను ఈ సమావేశంలో ఆమోదించనున్నారు."భారతీయ జీవిత బీమా ఏజెంట్ల ప్రయోజనాలను కాపాడటం, నైతిక బీమా విధానాలను ప్రోత్సహించడం మరియు దేశీయ బీమా రంగ అభివృద్ధికి తోడ్పడటమే LIAFI–1964 ప్రధాన నిబద్ధత.

రెండు రోజుల సమావేశంలో చర్చించిన అంశాలు, ఆమోదించిన తీర్మానాల పూర్తి వివరాలను ముగింపు అనంతరం మీడియాకు అందిస్తాం." అని తెలిపారు. ఈ సమావేశంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్.బి. శ్రీనివాసచారి, క్లియ (CLIA) చైర్మన్ మరియు జనరల్ బాడీ సమావేశ అడ్వైజరీ బోర్డు కో–చైర్మన్ కొటికె విఠల్, రాజ్యాంగ కమిటీ చైర్మన్ మరియు అడ్వైజరీ బోర్డు చైర్మన్ బి.ఎన్. చారి, స్వాగత కమిటీ చైర్మన్ సింగారపు శ్రీనివాస్, మరియు ప్రెస్ అండ్ పబ్లిసిటీ కమిటీ చైర్మన్ షేక్ షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్‌ను ప్రశ్నించలేని పరిస్థితిలో ప్రధాని మోదీ ఉన్నారు: పి. ప్రసన్న కుమార్ శర్మ

**హైదరాబాద్ వెలుతురు జూన్ 13:**

అమెరికా సైన్యం భారతీయ నావికులు ప్రయాణిస్తున్న చమురు ట్యాంకర్‌పై దాడి చేసి ముగ్గురు భారతీయుల ప్రాణాలు బలిగొన్న ఘటనపై ఇప్పటివరకు ప్రధాని నరేంద్ర మోదీ స్పందించకపోవడం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రశ్నించకపోవడం ఆయన పూర్తిగా అమెరికాకు సరెండర్ అయ్యారనే భావనకు బలం చేకూరుస్తోందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ విమర్శించారు.ఆయన మాట్లాడుతూ, ట్రంప్‌ను ప్రశ్నించలేని పరిస్థితిలో ప్రధాని మోదీ ఉన్నారని, భారతీయులు ఉన్న ట్యాంకర్‌పై అమెరికా దాడి జరిగినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మౌనం పాటించడం బాధాకరమన్నారు. ఒకవైపు దేశ ప్రజలకు పొదుపు చేయాలని, ప్రయాణాలు తగ్గించాలని సూచిస్తున్న ప్రధాని, మరోవైపు తరచూ విదేశీ పర్యటనలు చేస్తూ దేశానికి కొత్త పెట్టుబడులు లేదా పరిశ్రమలను తీసుకురావడంలో విఫలమవుతున్నారని ఆరోపించారు.దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ, సీఎన్‌జీ ధరలను అదుపులో ఉంచడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, ప్రజలపై భారాలు పెరుగుతున్నప్పటికీ ప్రధాని విదేశీ పర్యటనలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. మణిపూర్ వంటి రాష్ట్రాల్లో జరుగుతున్న సంక్షోభాలపై, మహిళలపై జరుగుతున్న దారుణాలపై ప్రధాని స్పందించడం లేదని, పత్రికా సమావేశాలు నిర్వహించి ప్రజలకు జవాబుదారీతనం చూపడం లేదని ప్రశ్నించారు.గతంలో విదేశాల్లో భారతీయ నావికులు ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాల్లో అప్పటి ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు చేసిన బీజేపీ నాయకత్వం, ఇప్పుడు ముగ్గురు భారతీయుల ప్రాణాలు కోల్పోయిన ఘటనపై మౌనం ఎందుకు పాటిస్తోందని ఆయన ప్రశ్నించారు.విద్యార్థుల పరీక్షా పత్రాల లీకేజీలు, వ్యవసాయ రంగ సమస్యలు, రైతుల పంటల కొనుగోలు అంశాల్లో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన ఆయన, ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రతిపక్ష పార్టీలపై రాజకీయ దాడులు చేస్తోందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచే చర్యలకు పాల్పడుతోందని కూడా విమర్శించారు.మరణించిన భారతీయ నావికుల కుటుంబాలకు ప్రధాని వ్యక్తిగతంగా సంతాపం తెలియజేయకపోవడం విచారకరమని, ఈ విషయంలో దేశ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. అమాయక భారతీయుల ప్రాణాలు కోల్పోయిన ఘటనపై అమెరికా ప్రభుత్వాన్ని నిలదీయకుండా, ఆ దేశ నాయకత్వంతో సన్నిహిత సంబంధాలు కొనసాగించడం ఎంతవరకు సమంజసమో ప్రధాని వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా ప్రధాని మోదీ తన వైఖరిని మార్చుకొని, దేశ ప్రజల ప్రయోజనాలను కాపాడే దిశగా పనిచేయాలని పి. ప్రసన్న కుమార్ శర్మ కోరారు.



# నాయకులకు మాటలకు ఫ్యూచర్ ఉండదా...? ఫ్యూచర్ సిటీకి... ఫ్యూచర్ ఉందా...!

"హామీలకు గడువు ఉండదు... మాటలకు విలువ ఉండదు... అలాంటప్పుడు 'ఫ్యూచర్ సిటీ'కి ఫ్యూచర్ ఎక్కడి నుంచి వస్తుంది?" ఇకగ్రేటర్ హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మహానగరంగా తీర్చిదిద్దుతున్నామని పాలకులు ఎన్నో సంవత్సరాలుగా చెబుతున్నారు. ఒకప్పుడు హైదరాబాద్‌ను డల్లాస్‌గా, సింగపూర్‌గా మారుస్తామని హామీలు ఇచ్చారు. తర్వాత "గ్లోబల్ సిటీ" అనే నినాదం వినిపించింది. ఇప్పుడు "ఫ్యూచర్ సిటీ" పేరుతో మరో కొత్త కలను ప్రజల ముందుంచుతున్నారు. పేర్లు మారుతున్నాయి. నినాదాలు మారుతున్నాయి. ప్రచార చిత్రాలు మారుతున్నాయి. కానీ నగరవాసుల రోజువారీ జీవితాల్లో మార్పు ఎంతవరకు కనిపిస్తోంది అనేదే అసలు ప్రశ్న. ఎందుకంటే కేవలం రెండు గంటలపాటు కురిసిన వర్షం మరోసారి హైదరాబాద్ మహానగర అభివృద్ధి వాస్తవ స్వరూపాన్ని ప్రజల కళ్లముందు ఉంచింది.మహానగరంగా, ఐటీ హబ్‌గా, అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా పేరొందిన హైదరాబాద్‌లో ఒక మోస్తరు వర్షం కురిసినప్పుడల్లా పరిస్థితి దాదాపు ఒకేలా ఉంటుంది. రహదారులు కాల్వలుగా మారిపోతాయి. కాలనీలు మురికి కూపాల్లా కనిపిస్తాయి. వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోతారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతింటాయి. ప్రజలు నిత్యావసర పనులకే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈసారి కూడా అదే జరిగింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన కేవలం కొద్ది గంటల వర్షమే నగర జీవనాన్ని అస్తవ్యస్తం చేసింది.మల్కాజిగిరి, ముషీరాబాద్, హిమాయత్‌నగర్, బహదూర్‌పురా తదితర ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. ఫలితంగా అనేక ప్రాంతాల్లో మోకాలి లోతు నీరు నిలిచి పోయింది. ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. చెట్లు విరిగిపడి రోడ్లపై పడటంతో వాహన రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. విద్యుత్ తీగలు తెగిపో వడంతో గంటల తరబడి కరెంట్ సరఫరా నిలిచి పోయింది. పలు కాలనీలు చీకట్లో మగ్గిపోయాయి. ఇంటర్నెట్ సేవలు కూడా అంతరాయం కలిగాయి. అత్యాధునిక సాంకేతికతకు ప్రతీకగా చెప్పుకునే ఐటీ కారిడార్ సైతం వర్షపు దెబ్బకు కుదేలైంది.గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, కొండాపూర్, రాయదుర్గం వంటి ప్రాంతాలు దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతాలుగా చెప్పుకుంటారు. ప్రపంచ స్థాయి సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. లక్షలాది మంది ఉద్యోగులు ప్రతిరోజూ ఇక్కడ పనిచేస్తున్నారు. అయితే వర్షం పడగానే ఈ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో మరోసారి కనిపించింది. బయోడైవర్సిటీ జంక్షన్ వద్ద వాహనాలు నీటిలో చిక్కుకుపోయాయి. నాలుగు లైన్లలో వెళ్లాల్సిన ట్రాఫిక్ ఒకే లైనుకు పరిమితమైంది. రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి రెండు గంటల సమయం పట్టిన సందర్భాలు ఉన్నాయి. సాయంత్రం కార్యాలయాల నుంచి బయలుదేరిన ఉద్యోగులు అర్ధరాత్రి దాటినా ఇంటికి చేరుకోలేక పోయారు.ఇది కేవలం ప్రకృతి వైపరీత్యం కారణంగా ఏర్పడిన పరిస్థితి కాదు. నగర ప్రణాళికలో ఉన్న లోపాలు, ముందస్తు చర్యల లోపం, సంబంధిత శాఖల సమన్వయ రాహిత్యం, పాలనా వైఫల్యం కలిసి సృష్టించిన సమస్య. ప్రతి ఏడాది వర్షాకాలం వస్తుందన్న విషయం ప్రభుత్వానికి కొత్త కాదు. ఏ ప్రాంతాల్లో నీరు నిలుస్తుందో, ఎక్కడ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయో, ఏ ప్రాంతాలు వరద ముప్పుకు గురవుతాయో అధికారులకు తెలియనిది కాదు. అయినప్పటికీ సమస్యలు పునరావృతం కావడం పరిపాలనా వైఫల్యానికే నిదర్శనం.హైదరాబాద్ నగర అభివృద్ధి గురించి గొప్పగా చెప్పుకునే వారు ఒక ముఖ్యమైన విషయాన్ని మరచిపో తున్నారు. అభివృద్ధి అంటే కేవలం ఫ్లైఓవర్లు, స్కైవేలు, భారీ భవనాలు, పెట్టుబడులు మాత్రమే కాదు. సాధారణ పౌరుడు సురక్షితంగా జీవించగలగడం, వర్షం వచ్చినా ఇబ్బందులు పడకుండా రాకపోకలు సాగించగలగడం, చెత్త పేరుకుపోకుండా పరిశుభ్రమైన పరిసరాలు ఉండటం, విద్యుత్, నీరు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు సమర్థంగా పనిచేయడం కూడా అభివృద్ధిలో భాగమే. కానీ ప్రస్తుతం కనిపిస్తున్న దృశ్యం ఇందుకు భిన్నంగా ఉంది.ఒకవైపు వేల కోట్ల రూపాయలతో భారీ ప్రాజెక్టులు ప్రకటిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి నగరాల కలలను ప్రజలకు చూపిస్తున్నారు. మరోవైపు మున్సిపాలిటీలకు చెత్త తొలగించడానికి కూడా సరిపడా నిధులు లేని పరిస్థితి కనిపిస్తోంది. కాలువల నిర్వహణ సరిగా జరగడం లేదు. డ్రైనేజీ వ్యవస్థలు సామర్థ్యానికి మించి ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. అభివృద్ధి పేరుతో కొత్త ప్రాజెక్టులు చేపడుతూనే ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాల నిర్వహణను విస్మరించడం తీవ్రమైన సమస్యగా మారింది.ఈ పరిస్థితుల్లో ప్రజలు అడుగుతున్న ప్రశ్న చాలా సహజమైనది. ముందుగా ఉన్న సమస్యలను పరిష్కరించకుండా భవిష్యత్ నగరాల కలలు చూపడం ఎంతవరకు సమంజసం? ప్రజల దైనందిన జీవితాన్ని ప్రభావితం చేస్తున్న సమస్యలకు పరిష్కారం చూపకుండా కొత్త నినాదాలు ఇవ్వడం ద్వారా వాస్తవ పరిస్థితులను దాచలేరు. ప్రజలకు ప్రచార కార్యక్రమాల కంటే మెరుగైన జీవన ప్రమాణాలు ముఖ్యమైనవి.ఇటీవలి వర్షాలు నగర పాలనా వ్యవస్థల సామర్థ్యాన్ని కూడా ప్రశ్నార్థకం చేశాయి. జీహెచ్ఎంసీ, జలమండలి, ట్రాఫిక్ పోలీసులు, విపత్తు నిర్వహణ విభాగాలు సమన్వయంతో పనిచేయాల్సిన సమయంలో ఆశించిన స్థాయిలో స్పందించలేకపోయాయి. రోడ్లపై నీరు నిలిచిపోయినా వెంటనే చర్యలు తీసుకోవడంలో ఆలస్యం జరిగింది. ట్రాఫిక్ నియంత్రణలో లోపాలు స్పష్టంగా కనిపించాయి. పలు ప్రాంతాల్లో ప్రజలు గంటల తరబడి సహాయం కోసం ఎదురు చూడాల్సి వచ్చింది.ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజల పరిస్థితి మరింత దారుణంగా మారింది. వర్షపు నీరు ఇళ్లలోకి చేరడం, విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, రాకపోకలు నిలిచిపోవడం వంటి సమస్యలు వారి జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ప్రతి సంవత్సరం ఇదే సమస్యలు ఎదురవుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారాలు కనిపించకపోవడం ప్రజల్లో నిరాశను పెంచుతోంది.

హైదరాబాద్ విస్తరణ కూడా మరో ప్రధాన కారణంగా కనిపిస్తోంది. నగరం వేగంగా విస్తరిస్తున్నప్పటికీ అందుకు అనుగుణంగా డ్రైనేజీ, రోడ్లు, నీటి పారుదల వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. చెరువులు, వాగులు, సహజ నీటి ప్రవాహ మార్గాలపై జరిగిన ఆక్రమణలు కూడా వరద సమస్యను మరింత తీవ్రమయ్యేలా చేశాయి. వర్షపు నీరు సహజంగా వెళ్లాల్సిన మార్గాలు మూసుకుపోవడంతో అది రహదారులపైకి, నివాస ప్రాంతాల్లోకి చేరుతోంది.ప్రపంచ స్థాయి నగరాల గురించి మాట్లాడే ముందు ప్రపంచ స్థాయి పట్టణ ప్రణాళిక అవసరం. నగర అభివృద్ధి అంటే కాంక్రీట్ నిర్మాణాల విస్తరణ మాత్రమే కాదని పాలకులు గుర్తించాలి. ప్రకృతి వ్యవస్థలను పరిరక్షిస్తూ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నగరాన్ని తీర్చిదిద్దాలి. వాతావరణ మార్పుల ప్రభావంతో భవిష్యత్తులో మరింత తీవ్ర వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున డ్రైనేజీ వ్యవస్థలను పునర్నిర్మించడం, వరద నిర్వహణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించడం అత్యవసరం.ఇక రాజకీయ కోణంలో చూస్తే ప్రతి ప్రభుత్వం తనదైన నినాదంతో ముందుకు వస్తోంది. కానీ ప్రజలు ఇప్పుడు నినాదాలను కాదు, ఫలితాలను కోరుతున్నారు. "గ్లోబల్ సిటీ", "ఫ్యూచర్ సిటీ" వంటి ఆకర్షణీయ పదజాలం ప్రజల్లో కొంతకాలం ఆశలు రేకెత్తించవచ్చు. కానీ ఒక వర్షం కురిసినప్పుడు ఆ నినాదాల అసలు విలువ పరీక్షించబడుతుంది. రోడ్లపై నిలిచిపోయిన నీరు, గంటల తరబడి కొనసాగిన ట్రాఫిక్, విద్యుత్ అంతరాయాలు, ప్రజల అవస్థలు ఆ నినాదాలన్నింటికీ వాస్తవ పరీక్షగా నిలుస్తాయి.ఒక మహానగరం యొక్క గొప్పతనం దాని భవనాల ఎత్తులో ఉండదు. దాని రహదారుల వెడల్పులో ఉండదు. పెట్టుబడుల పరిమాణంలో కూడా ఉండదు. ఒక సాధారణ పౌరుడు వర్షం వచ్చినప్పుడు కూడా భయపడకుండా జీవించగలగడంలో, సురక్షితంగా ఇంటికి చేరగలగడంలో, ప్రభుత్వ వ్యవస్థలు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించగలగడంలో ఉంటుంది. ఆ ప్రమాణాల ప్రకారం చూసినప్పుడు హైదరాబాద్ ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది.ప్రజల సహనాన్ని పరీక్షించే విధంగా ప్రతి వర్షాకాలంలో అదే సమస్యలు పునరావృతం కావడం ఆందోళన కలిగించే విషయం. ప్రభుత్వం, స్థానిక సంస్థలు, సంబంధిత శాఖలు ఈ హెచ్చరికను సీరియస్‌గా తీసుకోవాలి. నగర మౌలిక సదుపాయాలపై సమగ్ర సమీక్ష జరపాలి. డ్రైనేజీ వ్యవస్థలను ఆధునీకరించాలి. చెరువులు, కాలువలను పరిరక్షించాలి. ట్రాఫిక్ నిర్వహణకు సమర్థవంతమైన ప్రణాళికలు అమలు చేయాలి. అత్యవసర పరిస్థితుల్లో స్పందించే వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలి.లేకపోతే ప్రతి ఏడాది వర్షం పడినప్పుడల్లా అదే కథ పునరావృతమవుతుంది. కొత్త నినాదాలు వస్తాయి. కొత్త ప్రాజెక్టులు ప్రకటిస్తారు. కొత్త కలలు చూపిస్తారు. కానీ నేలమీద ప్రజలు మాత్రం పాత సమస్యలతోనే పోరాడాల్సి వస్తుంది. నిజమైన అభివృద్ధి అనేది ప్రజల జీవితాల్లో కనిపించాలి గానీ ప్రకటనల్లో కాదు. హైదరాబాద్‌కు ఇప్పుడు అవసరమైనది మరో కొత్త నినాదం కాదు, వర్షం వచ్చినా వణికిపోని, ప్రజలకు భరోసా ఇచ్చే, నివాసయోగ్యమైన, సమర్థవంతమైన నగర పాలన. అదే నిజమైన "ఫ్యూచర్ సిటీ"కి మొదటి అర్హత.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

# ప్రజాపాలనలో పర్యాటక రంగానికి కొత్త ఊపు

- పర్యాటక 'గమ్యస్థానంగా' తెలంగాణ: కొత్త పుంతలు తొక్కుతున్న వారసత్వ సంపద
- పెట్టుబడులు, ఉపాధి, పర్యాటకుల రాకలో విశేష పురోగతి
- పర్యాటకంలో రూ.23,741 కోట్ల పెట్టుబడుల MoU ల ప్రతిపాదనలు
- రూ.470 కోట్లతో పర్యాటక మౌలిక సదుపాయాలు
- గణనీయంగా పెరిగిన పర్యాటకుల సంఖ్య.. 10% పెరిగిన విదేశీ పర్యాటకులు
- 100 వీకెండ్ గేట్‌వే డెస్టినేషన్స్‌తో కొత్త ఊపు
- పెట్టుబడులు, పర్యాటకులు, అవార్డులు, వారసత్వ పరిరక్షణలో అద్భుతమైన ఫలితాలు
- రెండున్నరేళ్లలో అద్భుత ఫలితాలు: మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి
- ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయవంతం: మంత్రి జూపల్లి

**హైదరాబాద్, వెలుతురు జూన్ 13 :**

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రెండున్నరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ రంగాల్లో సాధించిన ప్రధాన విజయాలను మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను ప్రపంచస్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడం, రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం, కళాకారుల సంక్షేమాన్ని ప్రోత్సహించడం, పర్యాటక మౌలిక సదుపాయాలను విస్తరించడం, పెట్టుబడులను ఆకర్షించడం, స్థానిక ఉపాధి అవకాశాలను పెంపొందించడం వంటి లక్ష్యాలతో సమగ్ర కార్యాచరణ చేపట్టిందని మంత్రి తెలిపారు.

### టూరిజం పాలసీతో కొత్త దిశ

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తొలిసారిగా తెలంగాణ టూరిజం పాలసీ 2025–2030ను అమలు చేశామని మంత్రి తెలిపారు. ఈ విధానం ద్వారా రూ.15 వేల కోట్ల పెట్టుబడులు, 3 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పీపీపీ విధానంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సుస్థిర పర్యాటకం, డిజిటల్ ప్రచారం, అంతర్జాతీయ బ్రాండింగ్, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.

**టూరిజం పాలసీతో కొత్త దిశ**

**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తొలిసారిగా తెలంగాణ టూరిజం పాలసీ 2025–2030ను అమలు చేశామని మంత్రి తెలిపారు. ఈ విధానం ద్వారా రూ.15 వేల కోట్ల పెట్టుబడులు, 3 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పీపీపీ విధానంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సుస్థిర పర్యాటకం, డిజిటల్ ప్రచారం, అంతర్జాతీయ బ్రాండింగ్, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.**



### రూ.23,741 కోట్ల పెట్టుబడుల ఆకర్షణ

టూరిజం కాన్క్లేవ్–2025 ద్వారా 24 మంది పెట్టుబడిదారుల నుంచి రూ.15,285 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు లభించాయని మంత్రి తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025లో 18 మంది పెట్టుబడిదారులతో రూ.8,456 కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు కుదిరాయని చెప్పారు. వీటి ద్వారా 10 వేల ప్రత్యక్ష, 30 వేల పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడనున్నాయని పేర్కొన్నారు.

### రూ.470 కోట్లతో పర్యాటక మౌలిక సదుపాయాలు

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.181 కోట్ల విలువైన ప్రాజెక్టులు మంజూరయ్యాయని తెలిపారు. బుద్ధవనం, రామప్ప, సోమశిల, నిజాంసాగర్, బల్కంపేట ఆలయం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.289 కోట్ల వ్యయంతో 71 పర్యాటక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామని చెప్పారు.

### పర్యాటకుల రాకలో రికార్డులు

రాష్ట్రంలో పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి తెలిపారు. 2023లో 5.84 కోట్లుగా ఉన్న దేశీయ పర్యాటకుల సంఖ్య 2024లో రికార్డు స్థాయిలో 8.82 కోట్లకు చేరిందన్నారు. 2025లో 8.48 కోట్ల మంది తెలంగాణను సందర్శించారని చెప్పారు. విదేశీ పర్యాటకుల సంఖ్య 2024తో పోలిస్తే 2025లో 10 శాతానికి పైగా పెరిగిందన్నారు.

### 100 వీకెండ్ గేట్‌వే డెస్టినేషన్స్

99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా '100 వీకెండ్ గేట్‌వే డెస్టినేషన్స్' కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేశామని మంత్రి తెలిపారు. పరిశుభ్రత, సౌకర్యాలు, స్థానిక ఉపాధి, వీకెండ్ టూరిజం సర్క్యూట్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు.

### రోప్‌వేలు, అడ్వెంచర్ టూరిజం

తెలంగాణ చరిత్రలో తొలిసారిగా భువనగిరి కోట, ఖమ్మం కోటల వద్ద రోప్‌వే ప్రాజెక్టులు ప్రారంభించామని మంత్రి తెలిపారు. సోమశిల, హుస్సేన్ సాగర్, కోటిపల్లిలో అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్స్ ప్రారంభించామని చెప్పారు.

### క్రూయిజ్, బోటింగ్ టూరిజానికి ఊతం

హుస్సేన్ సాగర్‌లో 'ముచుకుంద' లగ్జరీ డబుల్ డెక్ క్రూయిజ్ సేవలను ప్రారంభించామని మంత్రి తెలిపారు. లక్నాపూర్, నిజాంసాగర్, వరదవెల్లి ప్రాంతాల్లో బోటింగ్ సౌకర్యాలను విస్తరించామని పేర్కొన్నారు.

### ప్రపంచ వేదికగా తెలంగాణ

72వ మిస్ వరల్డ్–2025 పోటీలను తెలంగాణ విజయవంతంగా నిర్వహించడం రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపును తీసుకొచ్చిందని మంత్రి తెలిపారు. తెలంగాణ సంస్కృతి, వారసత్వం, కళలు, హస్తకళలు, పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి పరిచయం చేసే అరుదైన అవకాశం ఈ కార్యక్రమం ద్వారా లభించిందన్నారు.

### అంతర్జాతీయ ఉత్సవాలకు తెలంగాణ వేదిక

ప్రతి ఏడాది నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ దేశ విదేశాల సందర్శకులను ఆకట్టుకుంటుందని తెలిపారు. 2026 ఉత్సవాల్లో 18 దేశాల ప్రతినిధులు, 37 అంతర్జాతీయ, 55 మంది దేశీయ కైట్ ఫ్లయర్లు పాల్గొన్నారని తెలిపారు.

హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్, డ్రోన్ ఫెస్టివల్‌ల ద్వారా తెలంగాణ పర్యాటక రంగానికి కొత్త ఆకర్షణలు జోడించామని చెప్పారు.

బతుకమ్మకు రెండు గిన్నిస్ రికార్డులు

బతుకమ్మ ఉత్సవాలు–2025 సందర్భంగా తెలంగాణ రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించడం రాష్ట్రానికి గర్వకారణమని మంత్రి తెలిపారు. అతిపెద్ద బతుకమ్మ పూల అలంకరణతో పాటు 1,354 మంది మహిళలతో నిర్వహించిన సమన్వయ బతుకమ్మ నృత్య ప్రదర్శన ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుందని చెప్పారు.

### హెరిటేజ్ టూరిజానికి ప్రాధాన్యం

హైదరాబాద్‌లో క్రమం తప్పకుండా హెరిటేజ్ వాక్‌లు నిర్వహిస్తున్నామని, హెరిటేజ్ రన్‌లో వేలాది మంది పాల్గొన్నారని తెలిపారు. తెలంగాణ చారిత్రక వారసత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

### జాతీయ స్థాయిలో గుర్తింపులు

సోమశిల 'బెస్ట్ టూరిజం విలేజ్ ఆఫ్ ఇండియా–2024', నిర్మల్ 'బెస్ట్ టూరిజం విలేజ్ ఆఫ్ ఇండియా–2024' అవార్డులు అందుకున్నాయని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌కు బెస్ట్ హెరిటేజ్ టూరిజం అవార్డు, బెస్ట్ ఇండిజినస్ క్యులినరీ డెస్టినేషన్ అవార్డు లభించాయని చెప్పారు.

### డిజిటల్ సంస్కరణలు

TG–iPASS ద్వారా ఆన్‌లైన్ అనుమతులు, ఈ–ఆఫీస్, జీపీఎస్ ట్రాకింగ్, డిజిటల్ టికెటింగ్, డిజిటల్ ప్రచార కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. పర్యాటకుల భద్రత కోసం టూరిస్ట్ పోలీసులను నియమించామని చెప్పారు.

### కళాకారుల సంక్షేమానికి ప్రాధాన్యం

1,690 మంది వృద్ధ కళాకారులకు నెలకు రూ.3,016 చొప్పున పెన్షన్ అందిస్తున్నామని తెలిపారు. పలువురు ప్రముఖ కళాకారులకు ప్రత్యేక పెన్షన్లు మంజూరు చేశామని చెప్పారు.

### 'తెలంగాణ ప్రజా కళ'కు విశేష స్పందన

రవీంద్రభారతిలో ప్రారంభించిన 99 రోజుల 'తెలంగాణ ప్రజా కళ' కార్యక్రమం ద్వారా జానపద, గిరిజన, సంప్రదాయ కళారూపాలకు కొత్త ఊపిరి పోశామని మంత్రి తెలిపారు.

### పురావస్తు రంగంలో విశేష ఫలితాలు

ఫణిగిరి, మాడుముల ప్రాంతాల్లో పురావస్తు తవ్వకాల ద్వారా చారిత్రక ఆధారాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. ఫణిగిరిలో బౌద్ధ మ్యూజియం ఏర్పాటు చేయడంతో పాటు పలు చారిత్రక కట్టడాల సంరక్షణ పనులు చేపట్టామని తెలిపారు.

### సాహిత్య రంగానికీ ప్రోత్సాహం

తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో 'పునాస' పత్రిక పునరుద్ధరణ, సాహిత్య వారం, దాశరథి శతజయంతి ఉత్సవాలు, రచయితల శిక్షణా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు.

### తెలంగాణకు కొత్త గుర్తింపు

పర్యాటకం, సంస్కృతి, వారసత్వ రంగాల్లో చేపట్టిన కార్యక్రమాల ఫలితంగా తెలంగాణ దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు పొందుతోందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పెట్టుబడులు, ఉపాధి, పర్యాటకాభివృద్ధి, వారసత్వ పరిరక్షణ, కళాకారుల సంక్షేమం అనే ఐదు ప్రధాన లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. తెలంగాణను ప్రపంచస్థాయి పర్యాటక, సాంస్కృతిక గమ్యస్థానంగా తీర్చిదిద్దే దిశగా మరింత వేగంగా పనిచేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# జాంబవంతుని గుడి స్థలాన్ని కాపాడుకుంటాం: దళిత సంఘాల నాయకుల హెచ్చరిక

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 13:**




జగద్గిరిగుట్ట లో నెలకొన్న జాంబవంతుని గుడి స్థలాన్ని కబ్జా చేయడాన్ని ఖండిస్తూ వెంటనే ఆ కబ్జా నుండి ఆ స్థలాన్ని కాపాడుకోవాలని నేడు దళిత సంఘాల నాయకులు సమావేశమై తీర్మానించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగద్గిరిగుట్ట లో వెలిసిన జాంబవంతుని గుడి స్థలంలో కొందరు స్థలాన్ని అమ్ముకొని అక్కడి నిర్మాణాలను ఏర్పాటు చేయడాన్ని ఖండిస్తూ ఆ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని నిన్న

కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులను కోరడం జరిగిందని గతంలో కూడా ఇదే స్థలంపై అక్రమ నిర్మాణాలు ఏర్పడితే రెవెన్యూ అధికారులు కూల్చివేశారని కానీ మళ్ళీ మళ్ళీ ఆ నిర్మాణాలు ఏర్పడుతున్నాయని కాబట్టి మరోసారి అలాంటి నిర్మాణాలు ఏర్పడకుండా దళిత సంఘాల నాయకులందరూ ఐక్యమై పోరాడు తామని అన్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జాంబవంతుని గుడి స్థలం అమ్ముకోవ డానికి ఎవరైనా ప్రయత్నిస్తే వారి పైన కూడా కేసులు పెడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు దొరవి బాబు, రాములు, ఎం ఆర్ పి ఎస్ నాయకులు అల్వాల భాస్కర్, ఆర్టీసీ బాబు, ముఖేష్, రమేష్,సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడతాం : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 13:**

శనివారం సీఎంసీ దుండిగల్ సర్కిల్ పరిధి బౌరంపేట లోని లహరి గ్రీన్ పార్క్ లో సుమారు కోటి రూపాయల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణపనులను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పరిశీలించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ....పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విస్తరిస్తున్న పట్టణీకరణకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతులను కల్పిస్తూ గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో



కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కూడా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ సందర్భంగా లహరి గ్రీన్ పార్క్ ప్రధాన రహదారి నిర్మాణ పనులను వెంటనే చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో పాక్స్ ఛైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు సునీతా మురళి యాదవ్, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, తెర అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ వెలగపూడి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, సభ్యులు మురళి, ప్రశాంత్, కాటం శ్రీనివాస్, నాయకులు ఎస్వి.సురేందర్ రెడ్డి, ధర్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎండల ప్రభావం.. పలు రాష్ట్రాల్లో వేసవి సెలవుల పొడిగింపు

**హైదరాబాద్, (వెలుతురు ప్రతినిధి) జూన్ 13:**



జగద్గిరిగుట్ట లో నెలకొన్న జాంబవంతుని గుడి స్థలాన్ని కబ్జా చేయడాన్ని ఖండిస్తూ వెంటనే ఆ కబ్జా నుండి ఆ స్థలాన్ని కాపాడుకోవాలని నేడు దళిత సంఘాల నాయకులు సమావేశమై తీర్మానించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగద్గిరిగుట్ట లో వెలిసిన జాంబవంతుని గుడి స్థలంలో కొందరు స్థలాన్ని అమ్ముకొని అక్కడి నిర్మాణాలను ఏర్పాటు చేయడాన్ని ఖండిస్తూ ఆ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని నిన్న

కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులను కోరడం జరిగిందని గతంలో కూడా ఇదే స్థలంపై అక్రమ నిర్మాణాలు ఏర్పడితే రెవెన్యూ అధికారులు కూల్చివేశారని కానీ మళ్ళీ మళ్ళీ ఆ నిర్మాణాలు ఏర్పడుతున్నాయని కాబట్టి మరోసారి అలాంటి నిర్మాణాలు ఏర్పడకుండా దళిత సంఘాల నాయకులందరూ ఐక్యమై పోరాడు తామని అన్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జాంబవంతుని గుడి స్థలం అమ్ముకోవ డానికి ఎవరైనా ప్రయత్నిస్తే వారి పైన కూడా కేసులు పెడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు దొరవి బాబు, రాములు, ఎం ఆర్ పి ఎస్ నాయకులు అల్వాల భాస్కర్, ఆర్టీసీ బాబు, ముఖేష్, రమేష్,సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దేశంలోని పలు రాష్ట్రాల్లో తీవ్ర ఉష్ణోగ్రతలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వాలు విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వేసవి సెలవులను పొడిగిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో పాఠశాలల పునఃప్రారంభ తేదీలను సవరించగా, మరికొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి.ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 12 నుంచే పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తెరుచుకోవడంతో విద్యార్థులతో సందడి నెలకొంది. తెలంగాణలో తొలుత జూన్ 12న పాఠశాలలు ప్రారంభించాలని నిర్ణయించినప్పటికీ, సెలవులను మూడు రోజులు పొడిగించి జూన్ 15 నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.ఉత్తరప్రదేశ్‌లో జూన్ 16 నుంచి పాఠశాలలు తెరుచుకోనున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో జూలై 1 నుంచి విద్యాసంస్థలు ప్రారంభం కానుండగా, హరియాణా, పంజాబ్ రాష్ట్రాల్లో కూడా అదే తేదీ నుంచి తరగతులు నిర్వహించనున్నారు.మధ్యప్రదేశ్‌లో మే 1 నుంచి జూన్ 15 వరకు వేసవి సెలవులు ప్రకటించగా, జూన్ 16 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోనూ ఇదే తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు అధికారులు వెల్లడించారు.బిహార్‌లో జూన్ 21న పాఠశాలలు తెరుచుకోనున్నాయని విద్యాశాఖ స్పష్టం చేసింది. రాజస్థాన్‌లో కొనసాగుతున్న ఎండల కారణంగా సెలవులను జూన్ 28 వరకు పొడిగించినట్లు తాజా సమాచారం.

మరోవైపు తమిళనాడులో జూన్ 4న, కర్ణాటక మరియు కేరళలో జూన్ 1 నుంచే పాఠశాలలు ప్రారంభమయ్యాయి. వివిధ రాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితులను బట్టి పాఠశాలల ప్రారంభ తేదీల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

# వర్క్ ఫ్రమ్ బైక్‌కు బ్రేక్: ప్రమాదకర డ్రైవింగ్‌పై సజ్జనార్ సీరియస్ వార్నింగ్

**హైదరాబాద్, (వెలుతురు ప్రతినిధి) జూన్ 13:**



బైక్ నడుపుతూ పెట్రోల్ ట్యాంక్‌పై ల్యాప్‌టాప్ ఉంచుకుని ఆఫీస్ పని చేస్తున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మాజీ పోలీసు అధికారి V.C. Sajjanar తీవ్రంగా స్పందించారు. రోడ్లపై ఇలాంటి ప్రమాదకర చర్యలు ప్రాణాలకు ముప్పుగా మారతాయని హెచ్చరిస్తూ, "వర్క్ ఫ్రమ్ బైక్" వంటి ధోరణులను వెంటనే మానుకోవాలని సూచించారు.కార్పొరేట్ డెడ్‌లైన్లు, పని ఒత్తిళ్లు ఎంత ఉన్నా ప్రాణాలను పణంగా పెట్టి ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడం బాధ్యతారాహిత్యమని ఆయన పేర్కొన్నారు. బైక్ నడుపుతున్న సమయంలో ఏకాగ్రత కోల్పోతే ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఇది ఇతర వాహనదారులు మరియు పాదచారుల భద్రతకు కూడా ముప్పు అని అన్నారు.హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో ఇలాంటి ఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన సజ్జనార్, ప్రయాణ సమయంలో ల్యాప్‌టాప్ ఉపయోగించడం, ఇయర్‌ఫోన్లు పెట్టుకుని ఫోన్ మాట్లాడడం వంటి చర్యలను పూర్తిగా నివారించాలని పిలుపునిచ్చారు.

"కడుపు నింపే ఉద్యోగం కడతేర్చేలా ఉండకూడదు" అంటూ ఉద్యోగులకు హితవు పలికారు.ఈ ఘటనపై నెటిజన్లు కూడా తీవ్రంగా స్పందిస్తూ, సంబంధిత బైకర్‌పై ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు మరోసారి గుర్తు చేశారు.

# ఆరుట్ల గ్రామంలో గీత కార్మికుడు సుంకరి లచ్చయ్యగౌడ్ సతీమణి సత్యమ్మ అనారోగ్యంతో మృతి

- సత్యమ్మ మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్ కార్యదర్శి చిందం శ్రీశైలం



**మంచాల వెలుతురు జూన్ 13:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో గీత కార్మికుడు సుంకరి లచ్చయ్యగౌడ్ సతీమణి అనారో గ్యంతో మృతి చెందింది ఈవిషయం తెలుసుకున్న ఆరుట్ల కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం కాంగ్రెస్ పార్టీ మంచాల మండలం కిసాన్ సెల్ అధ్యక్షుడు కావలి బుగ్గరాములు ముదిరాజ్ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు చెరుకు నర సింహగౌడ్ పార్టీ నాయకులతో కలిసి సుంకరి సత్యమ్మ మృతదేహంపై పూల మాలవేసి నివాళుల ర్పించారు అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రావులభాష కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకు లు దాసరమోని రమేష్ ముదిరాజ్ నూకంమల్లేష్ ముదిరాజ్ వైయస్సార్ మాధగోని జంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# మంచాలలో శ్రీ రేణుక ఎల్లమ్మ భజన మండలి సమితి ఆధ్వర్యంలో నల్ల చక్రవర్తి జీవిత చరిత్ర వీధి నాటకం

## ప్రాచీన కలలను ప్రోత్సహించాలి మంచాల గ్రామసర్పంచ్ ఏర్పుల సర్పంచ్ మానస వినయ్

**మంచాల వెలుతురు జూన్ 13:**



మంచాల మండల కేంద్రంలో శ్రీ రేణుక ఎల్లమ్మ భజన మండలి సమితి ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నల్ల చక్రవర్తి జీవిత చరిత్ర వీధి నాటకాలు నిర్వహిస్తున్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంచాల గ్రామ సర్పంచ్ ఏర్పుల మానస వినయ్ హాజరై శ్రీ రేణుక ఎల్లమ్మ భజన మం డలి సమితి కళాకారులకు 10000 వేల రూపాయలు ఆర్థికసహాయం అందించారు ఈసందర్భం గా మాట్లాడుతూ అంతరించిపోతున్న వీధి నాటకాలకు జీవం పోసి వీధి నాటకాలు నిర్వహించి నందుకు భజన సమితిని అభినందించారు యువత మొబైల్ ఫోన్లు వాడకం తగ్గించి ఆటలపైన చదువ పైన దృష్టి సారించాలని అన్నారు ఈకార్యక్రమంలో పంచాయతీ పాలక వర్గం గ్రామప్రజ లు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 7 గురు బంగ్లాదేశ్ జాతీయులు అరెస్ట్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 13:**




7 గురు బంగ్లాదేశ్ జాతీయులు అరెస్టు జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం నిఘా వర్గాల సమాచారం ఆధారంగా, జీడిమెట్ల పోలీస్ స్టేషన్ సిబ్బంది,గాజుల రామారం–జీడిమెట్ల ప్రాంతంలోని హెచ్ఏఎల్ కాలనీ ఏరియాలో ఉన్న ఒక అద్దె ఇంట్లో కొంతమంది బంగ్లాదేశ్ జాతీయులు అక్రమంగా నివసిస్తున్నట్లు గుర్తించారు. ఈసమాచారంపై చర్య తీసుకుంటూ, జీడిమెట్ల పీఎస్ ఎస్‌హెచ్ఓ తన బృందంతో కలిసి ఆ ప్రదేశంలో సోదాలు నిర్వహించారు. ఏడుగురు (07) బంగ్లాదేశ్ జాతీయులను అదుపులోకి తీసుకున్నారు.అదుపులోకి తీసుకున్న వ్యక్తులలో ఎవరి వద్దా భారతదేశంలో ఉండేందుకు అనుమతించే చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులు, వీసాలు లేదా ఇతర ప్రయాణ పత్రాలు లేవని తేలింది. ప్రాథమిక దర్యాప్తులో వారు భారతదేశంలోకి అక్రమంగా ప్రవేశించి దేశంలోని వివిధ ప్రాంతాల్లో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్లు వెల్లడైంది.దీంతో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. కుత్బుల్లాపూర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) ఎన్. కోటిరెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, వారిపై తగిన నిర్బంధ మరియు కదలికల నియంత్రణ ఉత్తర్వులను పొందారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను మెదక్ జిల్లా జోగిపేటలోని డిపోర్టేషన్ సెంటర్‌కు తరలించారు. నిర్దేశించిన చట్టపరమైన విధానం ప్రకారం వారి బహిష్కరణ ప్రక్రియను ప్రారంభించారు. సంబంధిత అధికారులచే అవసరమైన లాంఛనాలు ధృవీకరణ పూర్తయిన తర్వాత, వారిని బంగ్లాదేశ్‌కు బహిష్కరించి, వారి స్వస్థలాలకు తిరిగి పంపిస్తారు.ఈఆపరేషన్ లో భాగంగా ఎస్ఓటి కూకట్పల్లి జోన్ సిబ్బంది, జీడిమెట్ల సిఐ గడ్డం మల్లేష్, పాల్గొన్నారు.

# ఆర్జీకే సమస్యలపై ఎమ్మెల్యే వివేకానంద, మాజీ కార్పొరేటర్ జగన్ పర్యటన





**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 13:**

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప (ఆర్జీకే) సదాయంలో నెలకొన్న పలు సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద, స్థానిక మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ శనివారం కాలనీలో పర్యటించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ధర్మారపు అంజయ్య, ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, కాలనీ నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు ప్రధానంగా త్రాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల ఏర్పడుతున్న సమస్యలు, అలాగే జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారుల షాపుల తొలగింపు, సంక్షేమ సంఘం భవన నిర్మాణం,రోడ్ల తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల నుంచి వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ సంబంధిత అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించారు.అనంతరం ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. త్రాగునీటి కొరత, డ్రైనేజీ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించి కాలనీ ప్రజలకు ఉపశమనం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.చిరు వ్యాపారుల సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే, ఉపాధి కోసం చిన్న చిన్న షాపులు నిర్వహిస్తున్న వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వారి జీవనోపాధి దెబ్బతినకుండా పరిష్కారం చూపాలని కోరారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ త్రాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని, అలాగే చిరు వ్యాపారుల సమస్యను సానుకూలంగా పరిశీలించి వారికి ఇబ్బందులు కలగకుండా చూడటానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మహిళలు, చిరు వ్యాపారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిట్టీల బాధితులు సర్పంచ్‌ను ఆశ్రయించారు

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 13:**



నార్కెట్‌పల్లి పట్టణానికి చెందిన చిట్టీల సైదులు అనే వ్యక్తి గత కొన్ని సంవత్సరాలుగా స్థానిక కూలీలు, పేద కుటుంబాలు, కామినేని ఆస్పత్రిలో స్వీపర్లు, వంట పనులు చేసే కార్మికులు, గొర్రెలు–మేకలు కాసుకునే వారు, హోటళ్లలో పనిచేసే వారు తదితరుల వద్ద నుంచి చిట్టీల రూపంలో డబ్బులు సేకరించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.తమ పిల్లల పెళ్లిళ్లు, విద్యా అవసరాలు మరియు ఇతర కుటుంబ అవసరాల కోసం అనేక మంది చిట్టీలలో చేరగా, చిట్టీలు పూర్తయిన తరువాత వారికి రావాల్సిన డబ్బులను చెల్లించకుండా మోసం చేసినట్లు బాధితులు వాపోతున్నారు. కొందరికి కేవలం 10 శాతం మాత్రమే ఇచ్చి, పూర్తి మొత్తం తరువాత ఇస్తానంటూ సంతకాలు తీసుకున్నారని, అయితే ఇప్పటికీ మిగిలిన డబ్బులు ఇవ్వకుండా తిప్పించుకుంటున్నారని ఆరోపించారు. మరికొందరికి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా అందలేదని తెలిపారు.ఈ నేపథ్యంలో చిట్టీల బాధితులు శనివారం నార్కెట్‌పల్లి సర్పంచ్ జెర్రిపోతుల భరత్ కుమార్‌ను కలిసి తమ గోడును వినిపించారు. తమకు న్యాయం చేసి, కష్టపడి కూడబెట్టిన డబ్బులు తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.బాధితుల సమస్యను ఓపికగా విన్న సర్పంచ్ భరత్ కుమార్, అందరికీ న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని, సంబంధిత అంశంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం.

# చిన్నారుల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవంలో పాల్గొన్న చిరుమర్తి లింగయ్య

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 13:**



నకిరేకల్ మండల టీ న్యూస్ రిపోర్టర్ దొరపల్లి శంకర్ కుమార్తె, కుమారుడి నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవానికి నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆశీర్వాదాలు అందజేసి, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక ప్రముఖులు పాల్గొని చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. దొరపల్లి శంకర్ కుటుంబానికి చిరుమర్తి లింగయ్య అభినందనలు తెలియజేస్తూ, చిన్నారులు విద్యా, సాంస్కృతిక రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

# ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థుల అధ్యయనం



**చౌటుప్పల్ వెలుతురు జూన్ 13:**

కొయ్యలగూడెంలో చేనేత కళాకారుడు దుద్యాల శంకర్ తో కలిసి చేనేత కలపై అధ్యయనం చేసిన అర్నిత ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్ విద్యార్థులు కొయ్యలగూడెం (చౌటుప్పల్): చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామాన్ని అర్నిత ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్ కళాశాల విద్యార్థులు శనివారం సందర్శించారు. ప్రకృతి రంగుల తో చేనేత వస్త్రాలను ఉత్పత్తి చేసే దుద్యాల శంకర్ తో కలిసి చేనేత వస్త్రాలకు రంగులు, డిజైన్లు వేసే పద్ధతిని అధ్యయనం చేశారు. పోచంపల్లి పేరుతో ఖ్యాతిగాంచిన ఇక్కత్ డిజైన్ల ప్రత్యేకతను ఆ డిజైన్లు తయారు చేసే విధానాన్ని వారు పరిశీలించారు. చేనేత కలను సంప్రదాయాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని స్థానిక చేనేత కళాకారుల ద్వారా తెలుసుకున్నారు.

# నార్కట్‌పల్లి డిపోలో తెలంగాణ మజ్దూర్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక




**నార్కట్‌పల్లి, వెలుతురు జూన్ 13:**

నార్కట్‌పల్లి డిపోలో తెలంగాణ మజ్దూర్ యూనియన్ నూతన కమిటీ సభ్యులను డిపో మేనేజర్‌కు పరిచయం చేసే కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం నల్గొండ రీజియన్ సెక్రటరీ గోపనబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను డిపో మేనేజర్‌కు పరిచయం చేశారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఎండి మొయినుద్దీన్, సెక్రటరీగా చిలకల నరసింహ, అధ్యక్షుడిగా బడే బోగేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ధనబోయిన సుజాత బాధ్యతలు స్వీకరించారు.అసిస్టెంట్ సెక్రటరీలుగా మేడబోయిన మల్లికార్జున్, కె. మంజుల, ఉపాధ్యక్షులుగా కేవీన్ రెడ్డి, ఎ. అనంతలక్ష్మి , డి. లింగయ్య, దుర్గ, ఖజాంచీగా కొప్పు యాదగిరి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఏఆర్ రెడ్డి, నరసింహ, బి. యాదగిరి, వరలక్ష్మి , శ్రీవాణి, శకుంతల నియమితులయ్యారు.అలాగే చీఫ్ అడ్వైజర్లుగా ఎంఎస్ రెడ్డి, ఆర్. ఎల్లయ్య, ఎండి రసూల్ వ్యవహరించనున్నారు.ఈ పరిచయ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమం కోసం సమిష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# బిఆర్ఎస్లో చేరిన ప్రముఖ న్యాయవాది మంద నగేష్

**నల్లగొండ వెలుతురు జూన్ 13:**



నల్గొండ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి, నల్గొండ అభివృద్ధి ప్రదాత గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నల్లగొండ బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి మంద నగేష్ బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంద నగేష్ మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి జరిగిందని, కెసిఆర్ నాయకత్వంలో పనిచేయడానికి యువత ముందుకు రావాలని సూచించారు. రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోటిరెడ్డి, నల్లగొండ జిల్లా సభ్యత్వ నమోదు ఇంచార్జి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్, భూపాల్ రెడ్డి తదితరులున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతు సమస్యలపై చిత్తశుద్ధి లేదు: చిరుమర్తి లింగయ్య

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 13:**



నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని కేతేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.రాష్ట్రంలో రైతుల సమస్యల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పంట పండించడానికి రైతులు మూడు నెలలు కష్టపడితే, పంట విక్రయించడానికి నెలల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు ఎన్నడూ లేనంత ఇబ్బందులు ఎదుర్కొన్నారని, రైతు ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం అని ప్రచారం చేసుకోవడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతుబంధు, రుణమాఫీ వంటి రైతు సంక్షేమ పథకాల అమలులో చేతులెత్తేసిందన్నారు.రైతులకు అవసరమైన ఎరువుల సరఫరాలో తీవ్ర కొరత నెలకొందని, నాణ్యమైన విత్తనాలు అందించడంలో ప్రభుత్వం విఫలమవడంతో రైతులు దళారులపై ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. రైతులకు భరోసా కల్పించే పరిస్థితి లేకుండా పోయిందని, ఏ పంట సాగు చేయాలనే దానిపై ప్రభుత్వ మార్గనిర్దేశం కూడా లేదని పేర్కొన్నారు.రాష్ట్రంలో నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా లేక రైతాంగం తీవ్ర నష్టాలను ఎదుర్కొంటోందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ఆత్మవిశ్వాసం దెబ్బతిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిద్రావస్థలో ఉందని, ప్రజా సమస్యలపై ఎలాంటి దృష్టి లేదని ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సమస్యలను పరిష్కరించడం మానేసి ప్రతిపక్ష నాయకులపై విమర్శలు చేయడానికే పరిమితమయ్యారని అన్నారు. కే. చంద్రశేఖర్ రావు పై విమర్శలు చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.రాష్ట్రంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉన్నప్పటికీ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలతో కాలం గడుపుతోందని, గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు లభించిన భరోసా ప్రస్తుతం కనిపించడం లేదని, రైతులు, నిరుద్యోగులు, మహిళలు, విద్యార్థులు కాంగ్రెస్ పాలనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు.నకిరేకల్ నియోజకవర్గంలో మట్టి మాఫియా అక్రమాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని, అధికార పార్టీ నాయకుల అండదండలతోనే ఈ అక్రమాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. జిల్లా యంత్రాంగం, కలెక్టర్ కార్యాలయానికి పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేదని, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

స్థానిక ఎమ్మెల్యే ఒత్తిళ్ల కారణంగా అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నారని ఆరోపించిన ఆయన, అక్రమ మైనింగ్, మట్టి తరలింపులపై వెంటనే ప్రత్యేక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా జిల్లా అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా పనిచేయాలని కోరారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి దళారుల దోపిడీ నుంచి రక్షించే చర్యలను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని, కాంగ్రెస్–బీజేపీ లోపాయికారి రాజకీయ ఒప్పందాల కారణంగా రాష్ట్ర పరిపాలన దెబ్బతింటోందని చిరుమర్తి లింగయ్య ఆరోపించారు.

# ఘనంగా శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి వారి కళ్యాణం

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 13:**

నార్కట్‌పల్లి మండలంలోని గోపాలపల్లి గ్రామంలో శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, ఆయన ధర్మపత్ని రాజేశ్వరి దేవి ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు శాస్త్రోక్తంగా స్వామివారి కళ్యాణ వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు, మంగళ వాద్యాల నడుమ స్వామివారి కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి చిట్టేటి వెంకటరెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

# ఘనంగా పక్కిరు కొండల్ రెడ్డి గారి జన్మదిన వేడుకలు

**భువనగిరి జూన్, 13 (వెలుతురు న్యూస్):**



భువనగిరి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నందు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పక్కిరు కొండల్ రెడ్డి జన్మదినాన్ని భువనగిరి పట్టణం మరియు మండల కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేయించి జన్మదిన శుభకాంక్షలు తెలియా చేసిన భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఈ కార్యక్రమంలో భువనగిరి మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లంల జంగయ్య గారు,మాజీ pacs మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి మున్సిపల్ చైర్మన్ తంగలపల్లి శ్రీవాణి రవికుమార్ గారు,వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు భువనగిరి పురపాలక కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, ముఖ్యులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 13:**



పిర్యాది అయిన కక్కిరేణి గ్రామానికి దేశాపాక నరేందర్ తండ్రి అయిన మల్లయ్య తేది 10.06.2026 రోజు పని నిమ్మితం నార్కెట్పల్లి వెళ్లి పని ముగించుకొని ఇంటికి సాయంత్రం వస్తుండగా మార్గ మధ్యలో కక్కిరేణి గ్రామశివారులో ఉన్న బ్రిడ్జి దగ్గర నుండి వస్తుండగా అడ్డంగా సైకిల్ రావడం తో పిర్యాది తండ్రి మల్లయ్య తప్పించాబోయి ప్రమాదవశాత్తు కిందపడటం తో తలకు మరియు పక్కటేముకలకు, ఇతర చోట్ల గాయాలు కావడం తో అతనిని చికిత్స గిరించి నార్కెట్ పల్లి, కామినేనిహాస్పిటల్ కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఈ రోజు అనగా తేది 13.06.2026 రోజు సాయంత్రం 04.18 గంటలకు చనిపోయినాడని డ్యూటీ డాక్టర్లు నిర్ధారించి చెప్పినారని మాకు పిర్యాదు రావడం తో అక్కడనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాము. రామన్నపేట ఎస్ ఐ డి. నాగరాజ్ పోలీస్ స్టేషన్.

# రామన్నపేట మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా మోటే రమేష్

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 13:**



రామన్నపేట మండల కేంద్రంలో రామన్నపేట మండలం ఉప సర్పంచుల సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ సమావేశం కు ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు సుర్కంటి శ్రీధర్ రెడ్డి హాజరై ఉప సర్పంచ్ హక్కులు సాధించుకోవాలని, పిలుపు ఇవ్వడం జరిగింది. రామన్నపేట మండల అధ్యక్షులుగా మోటే రమేష్ ని ఎన్నుకోవడం జరిగింది. అదేవిధంగా నూతన కమిటీని ఏర్పాటు చేసుకోవడం జరిగింది.

# కమీషన్ల కోసమే హంగామా

- ప్రజలను మోసం చేసేందుకే హడావుడి
- జిల్లాలో ఇద్దరు మంత్రులూ అసమర్థులే
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శ

**నల్లగొండ టౌన్, వెలుతురు జూన్ 13:**



నల్లగొండలో ఈ నెల 17న పెద్ద స్కామ్ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పర్యటిస్తున్నారని, కమీషన్ల కోసమే హ్యాం రోడ్లు అంటూ హంగామా చేస్తున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. ప్రత్యేక ఓటర్ జాబితా పరిశీలన, పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదుపై శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో బీఆర్ఎస్ బూత్ స్థాయి ఏజెంట్ లు ప్రతి రోజూ బీఎల్ఓతో పాటే ఇంటింటికీ తిరుగుతూ అన్నీ పరిశీలించాలన్నారు. అందరి ఓట్లు కాపాడేలా పకడ్బందీగా పని చేయాలని సూచించారు. అనుమానం వస్తే వెంటనే ఆర్డీవోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేయాలని చెప్పారు. కోతల వెంకటరెడ్డి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారని, ప్రజలను మోసం చేసేందుకు డ్రామాలు అడుతున్నారని మంత్రినుద్దేశించి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అందుకే హ్యాం రోడ్లు అంటూ ఆర్భాటం చేస్తున్నారని, ఇప్పటి వరకు నల్లగొండ జిల్లాకు సీఎం ఒక్క రూపాయి ఇవ్వలేదని ఆరోపించారు. జిల్లాలో ఉన్న ఇద్దరు మంత్రులూ అసమర్థులే అని విమర్శంచారు.

ఇద్దరు మంత్రులు స్కామ్‌లు చేస్తూ పబ్బం గడుపుతున్నారని, మిల్లర్ల వద్ద ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. తన తమ్ముడికి పదవి వచ్చి తన పదవి పోయేలా ఉందని. అందుకే ఈ జిల్లా మంత్రి సీఎం రేవంత్‌రెడ్డిని కాకా పట్టేందుకు సభ పెడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వాల జిల్లా ఇన్‌చార్జి ఆర్ఎస్ .ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, గాదరి కిషోర్ కుమార్, జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ బండ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# స్వచ్ఛమైన పాఠశాలలు - విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది

- "మన బడి - మన బాధ్యత, స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమాన్ని విజయవంతం చేసిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

**కరీంనగర్ వెలుతురు జూన్ 13:**



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ గారి పిలుపుమేరకు, కరీంనగర్ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న

**మన బడి - మన బాధ్యత, స్వచ్ఛ పాఠశాల"**

కార్యక్రమంలో భాగంగా ఈ రోజు 2వ డివిజన్ తీగలగుట్టపల్లి ప్రభుత్వ పాఠశాలలో విస్తృత స్థాయిలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, పాఠశాల ప్రాంగణాన్ని పూర్తిగా పరిశుభ్రం చేశారు. తరగతి గదులను నీటితో కడిగి శుభ్రపరిచారు. విద్యార్థులు ఉపయోగించే బెంచీలు, కిటికీలు, తలుపులు, ప్రాంగణంలోని మొక్కల పరిసరాలను సైతం శుభ్రపరిచారు.ఈ సందర్భంగా మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ "మన బడి – మన బాధ్యత" అనే భావనతో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని నాయకులు కోరారు."పాఠశాల పరిశుభ్రతతో పాటు విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలు సమాజానికి ఆస్తులని, వాటి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. విద్యార్థులు పరిశుభ్రమైన వాతావరణంలో చదువుకుంటే వారి ఆరోగ్యం, విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ గారి ఆలోచనలకు అనుగుణంగా పాఠశాలల అభివృద్ధి, పరిశుభ్రత, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువత, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని పాఠశాల పరిశుభ్రత కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అలాగే భవిష్యత్తులో కూడా పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

# ఎల్.ఎమ్.డి జడ్పీ హైస్కూల్‌లో బీజేపీ శ్రేణుల ఆధ్వర్యంలో స్వచ్ఛ పాఠశాల...

**తిమ్మాపూర్ వెలుతురు జూన్ 13:**




దేశాభివృద్ధి, సేవా స్వచ్ఛత దిశగా భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవలో 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా , కరీంనగర్ పార్లమెంటు సభ్యులు , కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ పిలుపుమేరకు శనివారం స్థానిక ఎల్.ఎమ్.డి కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు 'స్వచ్ఛ పాఠశాల' కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చనే ఉద్దేశంతో బిజెపి శ్రేణులు శ్రమదానాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు పరిసరాలను శుభ్రం చేసి, పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఊడ్చి వేసారు.కేవలం ప్రభుత్వాలపైనే ఆధారపడకుండా, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా శ్రమదానం చేయాలని వారు పిలుపునిచ్చారు .విద్యార్థులు చదువుకునే విద్యాసంస్థలు దేవాలయాలతో సమానం అని. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే విద్యార్థులకు ఏకాగ్రత, మంచి ఆరోగ్యం సిద్ధిస్తాయనీ ,రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని బిజెపి నాయకులు కార్యకర్తలు ఈ సందర్భంగా చెప్పారు. ఈ ప్రోగ్రాం లో బీజేవైఎం నాయకులు దురిశెట్టి అజయ్, కుంట మల్ల ప్రేమ్ చంద్, చిందం అంజి, బూడిద శివ తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ మండల వ్యాప్తంగా బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా "స్వచ్ఛ పాఠశాల "

**తిమ్మాపూర్ వెలుతురు జూన్ 13:**




ప్రధాని మోదీ 12 సంవత్సరాల పాలన విజయవంతంగా పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని , కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఇచ్చిన పిలుపుమేరకు శనివారం రోజున తిమ్మాపూర్ మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో బిజెపి నాయకులు, కార్యకర్తలు అన్ని ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల ఆవరణలను, తరగతి గదులను బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్వయంగా శుభ్రం చేశారు. పిచ్చిమొక్కలను తొలగించి విద్యార్థులకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ మండల స్వచ్ఛ పాఠశాల ప్రోగ్రాం ఇన్చార్జి రంగు భాస్కరాచారి , మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ లు నలగోండ జడ్పీ స్కూల్లో స్థానిక బిజెపి శ్రేణులు చేపట్టిన స్వచ్ఛ పాఠశాల ప్రోగ్రాంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదియాలనే సంకల్పంతో స్వచ్ఛ పాఠశాల ప్రోగ్రాంకు శ్రీకారం చుట్టారని తెలిపారు. మండల వ్యాప్తంగా బీజేపీ శ్రేణులు "స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాయన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు, విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగిందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# హైడ్రా రంగనాథ్ కు హైకోర్టు జరిమానా

**హైదరాబాద్, వెలుతురు జూన్ 13:**



భూవివాదానికి సంబంధించిన కేసులో కోర్టు ఉత్తర్వులను ధిక్కరించినందుకు 'హైడ్రా' కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఆయనకు రూ.50 వేల జరిమానా విధిస్తూ జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ శుక్రవారం కీలక ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు ధిక్కరణ కింద ఈ చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మండలం, యూసఫ్‌గూడ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 45లో ఉన్న రెండెకరాల భూవివాదంపై మహ్మద్ షఫాహతుల్లా హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో న్యాయస్థానం యథాతథస్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని గతంలో ఆదేశాలు ఇచ్చింది. అయితే, ఈ ఆదేశాలను ఉల్లంఘించి అధికారులు ప్రహరీ గోడ కూల్చివేసి, కంచె ఏర్పాటు చేశారని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.ఈ పిటిషన్‌పై తాజాగా జరిగిన విచారణలో.. కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి చివరి అవకాశం ఇచ్చినా 'హైడ్రా' స్పందించకపోవడంపై జస్టిస్ శ్రవణ్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేటస్ కోను ఉల్లంఘించడాన్ని తప్పుబడుతూ కమిషనర్‌కు జరిమానా విధించారు. ఈ మొత్తాన్ని చీఫ్ జస్టిస్ రిలీఫ్ ఫండ్‌కు చెల్లించాలని, ఆ తర్వాతే కేసులో కౌంటర్ అఫిడవిట్‌ను స్వీకరించాలని రిజిస్ట్రీకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# మారనున్న నారాయణ్ ఖేడ్ దశ దిశ

- జాతీయ రహదారి విస్తరణకు రూ.47 కోట్లు మంజూరు
- టౌన్ లో మొదలైన హౌస్ మార్కింగ్ ప్రక్రియ

**వెలుతురు నారాయణఖేడ్ జూన్ 13 :**

సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ మున్సిపాలిటీ రూపురేఖలు మారబోతున్నాయి. నిజాంపేట్ – నారాయణఖేడ్ – బీదర్ మీదుగా సాగే జాతీయ రహదారి–161(బి) కు అనుసంధానంగా పట్టణంలో రోడ్డు విస్తరణ పనులకు రంగం సిద్ధమైంది. జహీరాబాద్ పార్లమెంటు సభ్యులు సురేష్ కుమార్ శెట్కార్ , నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్ శెట్కార్ ల కృషితో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక విస్తరణ ప్రాజెక్టు కోసం ఏకంగా రూ.47 కోట్ల భారీ నిధులను మంజూరు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నారాయణఖేడ్ మున్సిపల్ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారు. దీంతో ఖేడ్ పట్టణంలో రద్దీ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు, అంతర్రాష్ట్ర రవాణాకు సుగమం కానుంది.

### ముమ్మరంగా మార్కింగ్ ప్రక్రియ

కేంద్రం నుంచి నిధులు రావడంతో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (NHAI) అధికారులు క్షేత్రస్థాయిలో వేగంగా చర్యలు చేపట్టారు. రహదారి విస్తరణ కోసం ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు, రోడ్డుకిరువైపులా 50 అడుగుల (50 ఫీట్లు) మేర స్థలాన్ని జాతీయ రహదారి ప్రమాణాలకు అనుగుణంగా గుర్తించి మార్కింగ్ వేశారు. ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ విస్తరణను చేపట్టారు.



### బాధితులకు పరిహారంపై ఆశలు

రోడ్డు విస్తరణ ప్రక్రియలో భాగంగా తమ నివాసాలు, దుకాణాలు కోల్పోతున్న స్థానికులకు ప్రభుత్వం అండగా నిలవనుంది. అధికారులు ప్రస్తుతం కోల్పోతున్న ఇండ్లు మరియు ఇతర నిర్మాణాలకు నంబరింగ్ ప్రక్రియను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. నంబరింగ్ పూర్తయిన తర్వాత సమగ్ర నివేదికను రూపొందించి, బాధితులకు తగిన నష్టపరిహారం అందజేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

### పట్టణ ప్రజలకు ఎంతో ఊరట

నారాయణఖేడ్ ప్రాంతం కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దులకు అత్యంత సమీపంలో ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ పట్టణానికి సుమారు పది మండలాల నుంచి ప్రజలు అనునిత్యం వేలాదిగా తరలివస్తుంటారు. దీంతో వ్యాపార , వాణిజ్య పరంగా పట్టణం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. దీంతోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నారాయణఖేడ్ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. సంగారెడ్డి జిల్లాలో నారాయణఖేడ్ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అత్యంత ప్రాధాన్యత చోటుచేసుకుంది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా నారాయణఖేడ్ పట్టణంలో వ్యాపార , వాణిజ్య సముదాయాలకు అత్యధిక అద్దె వస్తుందని స్థానికులు



చెప్తున్నారు. సూపర్ మార్కెట్లు, షాపింగ్ కాంప్లెక్స్ లు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు నెలకొల్పేందుకు అత్యధిక అవకాశాలు ఉన్నాయి. ఈ జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు పూర్తిగా తీరనున్నాయి. ప్రస్తుతం నారాయణఖేడ్ పట్టణంలో ప్రతిరోజు 50 వేల వరకు ప్రయాణికులు వస్తుండడం విశేషం. కాగా సంగారెడ్డి జిల్లాలోనే అత్యధిక వేగంగా అభివృద్ధి చెందుతున్న నారాయణఖేడ్ మున్సిపల్ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు విశేషంగా కృషి చేస్తున్నారు. స్థానిక నేత అయిన జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శెట్కార్ సొంత ప్రాంతం పై ముందుచూపుతో పనులు చేపడుతున్నారు. అదేవిధంగా నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి భవిష్యత్తు తరాలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు చేపడుతూ ముందుకు వెళ్తున్నారు. పట్టణం చుట్టూ రింగు రోడ్డు పనులు, రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నారు. ప్రజలందరూ ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తున్నారని, రోడ్డు విస్తరణ పూర్తయితే నారాయణఖేడ్ వాణిజ్య పరంగా మరింత అభివృద్ధి చెందుతుందని స్థానికులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తయి పనులు గ్రౌండ్ లెవల్‌లోకి రానున్నట్లు తెలుస్తోంది.

# బావుపేట వద్ద రోడ్డుపై బీజేపీ ధర్నా

- కరీంనగర్ - కామారెడ్డి రహదారిపై స్తంభించిన ట్రాఫిక్
- వారం రోజుల్లో రోడ్డును బాగు చేయకపోతే భారీ ఆందోళన చేపడతాం
- బిజెపి మండల అధ్యక్షులు కుంట తిరుపతి హెచ్చరిక

**కరీంనగర్ వెలుతురు జూన్ 13:**



కరీంనగర్ – కామారెడ్డి ప్రధాన రహదారిపై బావుపేట స్టేజీ వద్ద రోడ్డు పూర్తిగా అధ్వాన్నంగా తయారై, నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిందని ఆరోపిస్తూ శనివారం రోజున కొత్తపల్లి రూరల్ మండల అధ్యక్షులు కుంట తిరుపతి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు కరీంనగర్ .. కామ రెడ్డి ప్రధాన రోడ్డుపై బైఠాయించి భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు కుంట తిరుపతి మాట్లాడుతూ ముఖ్యమైన కరీంనగర్ కామారెడ్డి ప్రధాన రహదారి మీదుగా సిరిసిల్ల, వేములవాడ తదితర ప్రాంతాలకు వెళ్ళే ప్రజలు , వాహనదారులు బహు పేట రాగానే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇక్కడి ప్రాంతానికి వందలాది సంఖ్యలో తరలివచ్చే గ్రానైట్ వాహనాల రాకపోక ల కు అనుగుణంగా రోడ్డు నిర్మించకపోవడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయన్నారు . ప్రధాన రహదారి మీద ఏర్పడిన భారీ గుంతల కారణంగా , వర్షపు నీరు ఆ గుంతలలో నిలిచి వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందన్నారు. పూర్తిగా ఇక్కడి ప్రాంతం గుంతలమయమైన రహదారి కావడం వల్ల నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. గత కొంతకాలంగా ఈ ప్రధాన రహదారి పరిస్థితి రోజురోజుకీ అధ్వానంగా మారుతున్న అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

ముఖ్యంగా రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడటంతో ద్విచక్ర వాహనదారులు, కారు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే పలువురు ప్రమాదాల బారిన పడి తీవ్రంగా గాయపడ్డారని గుర్తు చేశారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే నరకం కనిపిస్తోందన్నారు. బావుపేట వద్ద దెబ్బతిన్న రోడ్డుకు తక్షణమే శాశ్వత ప్రాతిపదికన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలనీ, పనులు పూర్తయ్యే లోపు ప్రమాదకర గుంతల వద్ద వాహనదారుల రక్షణ కోసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలనీ, కరీంనగర్ – కామారెడ్డి ప్రధాన రహదారి అభివృద్ధికి ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక నిధులు కేటాయించాలనీ ఆయన డిమాండ్ చేశారు. "నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ ప్రధాన రహదారిని నిర్లక్ష్యం చేయడం వల్లే ఎంతోమంది అమాయకులు ప్రమాదాల బారిన పడుతున్నందున, ప్రభుత్వం. అధికారులు స్పందించి వారం రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభించకపోతే, బీజేపీ ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేపడతామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వేముల అనిల్ కుమార్, సోమినేని కర్ణాకర్, నేరెళ్ల గంగారం, సోమినేని అజయ్, సటు నవీన్ తదితరులతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా బిజెపి కార్పొరేటర్ల, నాయకుల శ్రమదానం..

- బిజెపి కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలను అభినందించిన బండి సంజయ్

**కరీంనగర్ వెలుతురు జూన్ 13:**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రధానిగా 12 సంవత్సరాల విజయవంతమైన పాలనను పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం రోజున నగరంలోని 49వ డివిజన్ రాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో "మన బడి – మన స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు బిజెపి కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు పాఠశాలలోని తరగతి గదులను, పాఠశాల పరిసర ప్రాంతాలను శుభ్రం చేయడం తో పాటు పిచ్చిమొక్కలను తొలగించి పాఠశాల ఆవరణను మొత్తం క్లీన్ చేశారు.

విద్యార్థులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా తమ స్వచ్ఛ పాఠశాల కార్యక్రమం విజయవంతంగా కొనసాగిందని బిజెపి నేతలు ఈ సందర్భంగా అన్నారు.



### అభినందించిన కేంద్రమంత్రి బండి సంజయ్

సిరిసిల్ల లో స్వచ్ఛ పాఠశాల ప్రోగ్రాం కు వెళ్తున్న క్రమంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అకస్మాత్తుగా రాంనగర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాన్ని పరిశీలించి, పాఠశాల శ్రమదానంలో పాల్గొన్న బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు ఎన్నం లక్ష్మీ ప్రకాష్ , కర్రే పద్మ అనిల్ రావు ,బండ రమణ రెడ్డి , బోయినపల్లి ప్రవీణ్ రావు , గజ రామా శివరామ్ లతోపాటుబీజేపీ నాయకులు ఉప్పరపెల్లి శ్రీనివాస్, గుండరపు సంపత్, నరోతం రెడ్డి, బ్రహ్మం, ప్రవీణ్, రామ్, సంజీవ్, సంపత్, సంతోష్, కనుకయ్య, అరుణ్, హరీష్, రాజేష్, రమేష్, రాజు, రోమన్ రాజు, వెంకటేష్, కుమార్, మ్యకల కుమార్, వంశీ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వర్షంలోనూ ప్రజాసేవలో సైబరాబాద్ పోలీసులు

**సైబరాబాద్ వెలుతురు జూన్ 13:**



సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో శనివారం రోజున కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మరియు లా అండ్ ఆర్డర్ పోలీసు అధికారులు, సిబ్బంది రోడ్లపై ప్రత్యేకంగా విధులు నిర్వర్తిస్తున్నారు.ప్రధాన కూడళ్లు, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు చేపడుతున్నారు. అదే విధంగా లా అండ్ ఆర్డర్ సిబ్బంది ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ, వర్షం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అండగా నిలుస్తున్నారు.వర్షపు నీటితో నిండిన ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా సూచనలు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన అందించేందుకు అన్ని పోలీసు యంత్రాంగాలు అప్రమత్తంగా పనిచేస్తున్నాయి.ప్రజలు కూడా అవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని, ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటించాలని సైబరాబాద్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# ప్రపంచ యోగాసనం ఛాంపియన్ షిప్ - 2026 లో పతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారులకు ఘన సన్మానం

**హైదరాబాద్ వెలుతురు జూన్ 13:**

జూన్ 4వ తేదీ నుండి 8వ తేదీ వరకు అహ్మదాబాద్ లో నిర్వహించబడిన ప్రపంచ యోగాసన ఛాంపియన్ షిప్ –

– 2026 లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు విశిష్ట ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ వేదికపై పతకాలు సాధించడం గర్వకారణంగా నిలిచింది. ఈ అద్భుత విజయాన్ని పురస్కరించుకొని విజేతలైన క్రీడాకారులకు ఘన సన్మాన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.ఈ ప్రపంచ స్థాయి పోటీల్లో తెలంగాణకు చెందిన వనజా రెడ్డి గారు స్వర్ణ పతకం సాధించి భారతదేశానికి గర్వకారణంగా నిలవగా, జి. సతీష్ కుమార్ గారు రజత పతకం సాధించి తెలంగాణ యోగాసన క్రీడాకారుల ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పారు. వారి అంకితభావం, క్రమశిక్షణ, నిరంతర సాధన యువతకు ఆదర్శంగా నిలుస్తుందని పలువురు అభినందించారు.ఈ విజయోత్సవ కార్యక్రమంలో జి. శ్రీధర్ రావు గారు (అధ్యక్షులు, టీవైఎస్ఏ) మరియు నందనం కృపాకర్ గారు (ప్రధాన కార్యదర్శి, టీవైఎస్ఏ) పాల్గొని విజేతలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జి. శ్రీధర్ రావు గారు ప్రతి విజేత క్రీడాకారునికి రూ.1,00,000 (ఒక లక్ష



రూపాయలు) నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు.ఈ సందర్భంగా జి. శ్రీధర్ రావు గారు మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్రం నుండి ప్రతిభ కనబరుస్తున్న ప్రతి క్రీడాకారుడికి ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. క్రీడాకారుల అభివృద్ధి కోసం, వారి ప్రతిభను ప్రపంచస్థాయికి తీసుకెళ్లేందుకు మా సంఘం పూర్తి సహకారం ఎప్పటికీ కొనసాగుతుంది" అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, ఇతర యోగాసన సంఘ ప్రతినిధులు పాల్గొని విజేతలను ఘనంగా అభినందించారు. వారు మాట్లాడుతూ ఈ విజయం తెలంగాణ రాష్ట్ర యోగాసన క్రీడా చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని, ఇది రాష్ట్రంలోని యువ క్రీడాకారులకు గొప్ప స్ఫూర్తిగా



నిలుస్తుందని పేర్కొన్నారు.అలాగే తెలంగాణ రాష్ట్రంలో టీవైఎస్ఏ క్రీడల అభివృద్ధికి మరింత కృషి చేస్తుందని, గ్రామ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని నిర్వాహకులు తెలిపారు.అంతర్జాతీయ వేదికపై తెలంగాణ క్రీడాకారులు సాధించిన ఈ ఘన విజయం రాష్ట్రానికే కాకుండా దేశానికీ గర్వకారణమని, భవిష్యత్తులో మరింత మంది యువత యోగాసన క్రీడల్లో పాల్గొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించాలని టీవైఎస్ఏ ఆకాంక్షించింది.టీవైఎస్ఏ తరపున విజేతలందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి, దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని కోరుకుంటున్నాము అని అన్నారు.

# సంస్కారాలు అందే బాలా రామాయణం ఆచార్య కసిరెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూన్ 13:**



శనివారం రోజున రవీంద్ర భారతి సమావేశ మందిరంలో తెలంగాణ భాష సాంప్రతిక శాఖ, తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో ప్రముఖ కవి అక్కి నరసింహులు గౌడ్ రచించిన బాల రామాయణం పుస్తకావిష్కరణ మహోత్సవం జరిగింది తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షులు బడే సాబ్ నిర్వాహణలో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఆవిష్కర్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వ తెలుగు శాఖ అధ్యక్షులు మాట్లాడుతూ మళ్లీ మరో రామాయణం వచ్చింది అలనాడు విశ్వనాథ సత్యనారాయణ మళ్ళీ రామాయణం ఎందుకు అని ప్రశ్న వేశారు ఇప్పటి తరానికి మళ్లీ మళ్లీ రామాయణంలోని సంస్కారాలు తెలియజేయవలసిన అవసరం ఎంతైనా ఉందని బాల రామాయణంలో మనకు అడుగడుగునా కనపడుతుంది రామాయణంలోని పాత్రలు విషయాలు నేటి నేటితరం అలవర్చుకోవాలి రాముని లాగా గుణగణాలు ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి ప్రతి పౌరుడు నే ర్చుకోవాలి రాముని లాగా న్యాయం, ధర్మం, నీతి ఉండాలని ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు మరో అతిథి సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ మాట్లాడుతూ రామాయణం నేటికీ తరానికి వచ్చే తరానికి రామాయణంలోని వస్తువు మారదు పూర్తిగా ఉంటుంది రాముని లాగా ఉండాలని వారు మాట్లాడారు మరో అతిథి గంట మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రముఖ కవి అక్కి నరసింహులు గౌడ్ బాల రామాయణం పంచపద్రియలో రాయడం చాలా ఆనందం వేమనలాగా అందరికీ అర్థమయ్యే భాషలో నేడు నరసింహులు కూడా బాలా రామాయణాన్ని పిల్లలకు అర్థమయ్యే భాషలో రాయడం చాలా సంతోషం వారికి అభినందనలు అని అన్నారు ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులు పంచపది సృష్టికర్త విటల్, కార్యక్రమంలో శ్రీ రామకృష్ణ చంద్రమౌళి ప్రముఖ కవి విమర్శకులు, డాక్టర్ రాధాకుసుమ, డాక్టర్ కోగంటి ఉషారాణి, రమాదేవి బుక్కపట్నం, కట్ట శ్యామల, కేసు రాజు రాంప్రసాద్, ప్రకాష్ , పెద్ద సంఖ్యలో రచయితలు కవులు కళాకారులు పాల్గొని, కుటుంబ సభ్యులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని రచయితకు అభినందనలు తెలియజేశారు.

# నీట్ పేపర్ లీకేజీపై ఎన్ఎస్‌యూఐ ఆందోళన

- **ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్**
- **హైదరాబాద్‌లో భారీ నిరసన ర్యాలీ**
- **ట్యాంక్‌బండ్ నుంచి లోక్‌భవన్ వరకు ఎన్ఎస్‌యూఐ ప్రదర్శన**
- **విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా దొద్దంటూ నినాదాలు**
- **కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకర్తల ఆగ్రహం**
- **నీట్ పరీక్షల నిర్వహణపై తీవ్ర విమర్శలు**
- **పేపర్ లీకేజీ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు కోరిన నేతలు**
- **బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**
- **విద్యా వ్యవస్థ విశ్వసనీయత దెబ్బతిందన్న ఆందోళన**
- **లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకమైందన్న ఎన్ఎస్‌యూఐ**
- **కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్**




**హైదరాబాద్ వెలుతురు జూన్ 13:**

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారాన్ని నిరసిస్తూ ఎన్ఎస్‌యూఐ శ్రేణులు హైదరాబాద్‌లో భారీ ఆందోళన చేపట్టాయి. ట్యాంక్‌బండ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి లోక్‌భవన్ (రాజ్‌భవన్) వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.నీట్ పరీక్షలో చోటుచేసుకున్న పేపర్ లీకేజీ ఘటన దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపిందని ఎన్ఎస్‌యూఐ నాయకులు ఆరోపించారు. పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాలకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వం వైఖరిని నిరసిస్తున్నట్లు తెలిపారు.ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ నాయకులు కోరారు. దేశంలోని పోటీ పరీక్షలపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో విశ్వాసం దెబ్బతినకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ర్యాలీ సందర్భంగా భారీ సంఖ్యలో ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు ఊరట

- **స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అంగన్వాడీ సిబ్బందికి పునర్నియామకానికి అవకాశం**
- **మంత్రి సీతక్క చొరవతో అర్హులైన వారికి తిరిగి విధుల్లోకి వచ్చే మార్గం సుగమం**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 13:**

అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజీనామా చేసి అనంతరం ఎన్నికల్లో ఓడిపోయిన అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల పునర్నియామక ప్రక్రియకు ప్రభుత్వం పచ్చా జెండా ఊపింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతో ఈ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించింది. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా ఎన్నికల్లో పోటీ చేసిన కారణంగా ఉద్యోగాలను కోల్పోయిన అంగన్వాడీ సిబ్బందికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామ పంచాయతీ లేదా మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజీనామా చేసి, ఎన్నికల్లో విజయం సాధించని అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల అప్పీల్స్‌ను పరిశీలించనున్నారు. అయితే వారి స్థానంలో ఇప్పటికే మరో అభ్యర్థిని నియమించని సందర్భాల్లో మాత్రమే పునర్నియామకానికి అవకాశం కల్పించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు శాఖ సెక్రటరి అనితా రామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో భాగంగా సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సేవలు అందించే కీలక భాగస్వాములని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అనేక మంది అంగన్వాడీ టీచర్లు,



హెల్పర్లకు ఊరట లభించనుంది. అర్హులైన వారి అభ్యర్థనలను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిశీలించి వారి పునర్ నియాయమం చేపట్టనున్నారు.

# నలుగురు మావోయిస్టులకు బెయిల్

- **గతేడాది నవంబర్‌లో భారీ పోలీస్ ఆపరేషన్**
- **పటమట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**
- **నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్**
- **కోర్టులో డిఫాల్ట్ బెయిల్ పిటిషన్**
- **ఛార్జిషీట్‌పై కోర్టు అభ్యంతరాలు**
- **'ఆపరేషన్ కగార్' ప్రస్తావన**
- **ఇరుపక్షాల వాదనలు పూర్తి**
- **బెయిల్‌కు విధించిన కఠిన షరతులు**

**విజయవాడ వెలుతురు జూన్ 13:**

విజయవాడలో గత ఏడాది సంచలనం సృష్టించిన మావోయిస్టుల అరెస్టు కేసులో మచిలీపట్నం జిల్లా కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. జైలులో రిమాండ్‌లో ఉన్న నలుగురు మావోయిస్టులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. గోపీ షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బెయిల్ పొందిన వారిలో పొడియం రెంగు అలియాస్ బీమ (ఏ1), మదకం మదన్ అలియాస్ మదనన్న (ఏ2), సోది మనీలా (ఏ3), సోది మంగి (ఏ4)లు ఉన్నారు. కఠినమైన నిబంధనలకు లోబడి వారికి ఈ బెయిల్ ఇస్తున్నట్లు న్యాయస్థానం స్పష్టం చేసింది.

### గత ఏడాది నవంబర్‌లో భారీ పోలీస్ ఆపరేషన్

గత ఏడాది నవంబర్ నెలలో విజయవాడ నగరంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయంటూ పోలీసులకు పక్కా సమాచారం అందింది. విజయవాడలోని కానూరు పరిధిలో ఉన్న కొత్త ఆటోనగర్‌లోని ఒక భవనంలో కొందరు మావోయిస్టులు రహస్యంగా బస చేస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించాయి. దీంతో రంగంలోకి దిగిన ఆక్టోపస్, గ్రేహౌండ్స్ వంటి ప్రత్యేక రక్షణ దళాలు స్థానిక పోలీసుల సహకారంతో ఆ ప్రాంతాన్ని పూర్తిగా చుట్టుముట్టాయి. అత్యంత వ్యూహాత్మకంగా నలువైపుల నుంచి ఆ భవనాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టారు.

### పటమట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

పోలీసులు నిర్వహించిన ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా గత ఏడాది నవంబర్ 18వ తేదీన విజయవాడలోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు జరిగాయి. ఈ తనిఖీల్లోనే పొడియం రెంగు, మదకం మదన్, సోది మనీలా, సోది లతో కూడిన నలుగురు మావోయిస్టులను పోలీసులు విజయవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అప్పట్లోనే ఈ అరెస్టు ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ అరెస్టుల అనంతరం నిందితులపై విజయవాడలోని పటమట పోలీస్ స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

### నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్

పోలీసుల విచారణ ముగిసిన తర్వాత నిందితులు నలుగురిని అప్పట్లో స్థానిక న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. న్యాయస్థానం వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో, భద్రతా కారణాల దృష్ట్యా వారిని నెల్లూరులోని కేంద్ర కారాగారానికి (సెంట్రల్ జైలు) తరలించారు. అప్పటి నుంచి ఈ నలుగురు మావోయిస్టులు నెల్లూరు జైలులోనే కస్టడీలో ఉంటూ వస్తున్నారు. సుదీర్ఘ కాలంగా వారి రిమాండ్ గడువు పొడిగిస్తూ రావడం జరిగింది.

### కోర్టులో డిఫాల్ట్ బెయిల్ పిటిషన్

తాజాగా నిందితులు దాదాపు 200 రోజులకు పైగా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నేపథ్యంలో, వారి తరపు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ మచిలీపట్నంలోని జిల్లా ప్రధాన న్యాయస్థానంలో 'డిఫాల్ట్ బెయిల్' మంజూరు చేయాలని కోరుతూ ఒక పిటిషన్ దాఖలు చేశారు. చట్టప్రకారం నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి కానప్పుడు లేదా సాంకేతిక కారణాలు ఉన్నప్పుడు నిందితులకు బెయిల్ పొందే హక్కు ఉంటుందని ఆయన కోర్టుకు నివేదించారు. ఈ పిటిషన్‌పై జిల్లా కోర్టులో సుదీర్ఘంగా వాదనలు జరిగాయి.

### ఛార్జిషీట్‌పై కోర్టు అభ్యంతరాలు

ఈ కేసు విచారణ సందర్భంగా నిందితుల తరపు న్యాయవాది శ్రీనివాస్ కోర్టు ముందు ఒక ముఖ్యమైన అంశాన్ని లేవనెత్తారు. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు అధికారులు న్యాయస్థానంలో దాఖలు చేసిన ఛార్జిషీట్ (దోషారోపణ పత్రం)పై కోర్టు గతంలో కొన్ని కీలకమైన అభ్యంతరాలను వ్యక్తం చేసిందని ఆయన గుర్తుచేశారు. ఆ అభ్యంతరాల వల్ల ఛార్జిషీట్‌ను కోర్టు వెనక్కి పంపిందని, ఈ కారణంగానే నిందితులు సుదీర్ఘ కాలంగా జైలులోనే మగ్గాల్సి వస్తోందని ఆయన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. కాబట్టి చట్టపరంగా వారికి డిఫాల్ట్ బెయిల్ ఇవ్వడం సమంజసమని వాదించారు.

### 'ఆపరేషన్ కగార్' ప్రస్తావన

విచారణలో భాగంగా న్యాయవాది శ్రీనివాస్ మరో ఆసక్తికరమైన విషయాన్ని కూడా ప్రస్తావించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మావోయిస్టుల నిర్మూలనకు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ కగార్' ప్రభావం వల్ల అడవుల్లో పరిస్థితులు వేగంగా మారుతున్నాయని చెప్పారు. ఈ ఆపరేషన్ దెబ్బకు దేశంలోని పలు ప్రాంతాల్లో చాలా మంది మావోయిస్టులు ఆయుధాలను వదిలిపెట్టి జనం జీవన స్రవంతిలో కలవడానికి లొంగిపోతున్నారని కోర్టుకు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో నిందితులను జైలులోనే ఉంచాల్సిన అవసరం లేదని వివరించారు.

### ఇరుపక్షాల వాదనలు పూర్తి

మరోవైపు ప్రభుత్వం తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వరరావు నిందితులకు బెయిల్ ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. వీరు తీవ్రమైన దేశద్రోహ చర్యలకు, మావోయిస్టు కార్యకలాపాలకు పాల్పడ్డారని, వీరికి బెయిల్ ఇస్తే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందంటూ ప్రభుత్వ వాదనలను గట్టిగా వినిపించారు. ఈ నెల 2వ తేదీనే ఇరుపక్షాల లాయర్ల మధ్య సుదీర్ఘంగా సాగిన వాదనలు ముగిశాయి. ఇరు వర్గాల వాదనలను నమోదు చేసుకున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. గోపీ, కేసు డైరీని, చట్టపరమైన నిబంధనలను కూలంకషంగా పరిశీలించి తాజాగా నిందితుల వాదనలతో ఏకీభవిస్తూ నలుగురికీ బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు చెప్పారు.

### బెయిల్‌కు విధించిన కఠిన షరతులు

న్యాయస్థానం వీరికి బెయిల్ మంజూరు చేసినప్పటికీ, భద్రతను దృష్టిలో ఉంచుకుని కొన్ని కఠినమైన షరతులను విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.బెయిల్ పొందిన ప్రతి నిందితుడు రూ. 25 వేల రూపాయల చొప్పున రెండు పూచీకత్తులను (షూరిటీలను) కోర్టుకు సమర్పించాల్సి ఉంటుంది.ఈ పూచీకత్తులు ఇచ్చే ఇద్దరిలో కచ్చితంగా ఒకరు స్థానిక వ్యక్తి అయి ఉండాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

అత్యంత ముఖ్యమైన షరతు ఏంటంటే, కోర్టు ముందస్తు అనుమతి లేకుండా ఈ నలుగురు మావోయిస్టులు విజయవాడలోని పటమట పోలీస్ స్టేషన్ పరిధిని దాటి ఎక్కడికీ వెళ్లకూడదు.న్యాయస్థానం విధించిన ఈ నిబంధనలన్నింటినీ పూర్తి చేసి, అవసరమైన పత్రాలను సమర్పించిన తర్వాతే నెల్లూరు జైలులో ఉన్న నలుగురు మావోయిస్టులు అధికారికంగా విడుదల కానున్నారు.

# సింగరేణిలో బొగ్గు మాయం ఆరోపణలు.. సమగ్ర విచారణ జరిపించాలి: సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి లేఖ

- రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గుపై మీడియాలో కథనాలు
- వ్యవహారంపై నిజానిజాలు వెలికితీయాలని కేంద్ర మంత్రివర్యుడి డిమాండ్
- సింగరేణిలో భద్రతా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయాలని సూచన
- ఇంటర్నల్ కంట్రోల్ సిస్టమ్ పనితీరును సమీక్షించాలన్న కిషన్‌రెడ్డి
- సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం భారీ బకాయిలు చెల్లించాల్సి ఉందన్న వ్యాఖ్య
- రూ.51,500 కోట్లకు పైగా బకాయిలతో ఆర్థిక ఒత్తిడి పెరిగిందని ఆందోళన
- పారదర్శకత, విశ్వసనీయతను బలోపేతం చేయాలని సూచన
- సింగరేణి భవిష్యత్తు పరిరక్షణ అందరి బాధ్యత అని వ్యాఖ్య
- 40 వేల మందికిపైగా కార్మికుల సంక్షేమం దృష్టిలో ఉంచుకోవాలని విజ్ఞప్తి

**హైదరాబాద్ వెలుతురు జూన్ 13:**

సింగరేణి సంస్థలో అవకతవకలు జరిగాయంటూ మీడియాలో వెలువడుతున్న కథనాలపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాసి, సింగరేణిలో చోటుచేసుకున్నట్లు ప్రచారంలో ఉన్న అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.సింగరేణి నుంచి దాదాపు రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందంటూ మీడియాలో కథనాలు రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని లేఖలో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో నిజానిజాలు వెలుగులోకి వచ్చేలా



స్వతంత్ర, సమగ్ర దర్యాప్తు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.సంస్థలో భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కిషన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. బొగ్గు నిల్వలు, రవాణా, విక్రయాల ప్రక్రియలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే సంస్థలో అమలవుతున్న సేఫ్‌గార్డ్స్, ఇంటర్నల్ కంట్రోల్ సిస్టమ్ పనితీరును సమగ్రంగా సమీక్షించాలని కోరారు.ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రూ.51,500 కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉందని లేఖలో ప్రస్తావించారు. ఈ భారీ బకాయిల కారణంగా సంస్థపై ఆర్థిక ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. సింగరేణి ఆర్థిక స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకుని బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.దేశంలోనే ప్రముఖ ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థలలో ఒకటైన సింగరేణి సామర్థ్యం, పారదర్శకత, విశ్వసనీయతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

సంస్థ అభివృద్ధి, పరిరక్షణ విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు.సింగరేణిలో పనిచేస్తున్న 40 వేల మందికిపైగా కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమంతో పాటు సంస్థ భవిష్యత్తును కాపాడటం మన అందరి బాధ్యత అని కిషన్‌రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. సంస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టేందుకు పారదర్శక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## సింగరేణి సంస్థలో 335 మందికి కారుణ్య ఉద్యోగాలకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్





**సింగరేణి వెలుతురు జూన్ 13:**

సింగరేణి లో 335 మంది కారుణ్య నియామక పత్రాలు అందుకున్న వారందరికీ శుభాకాంక్షలు.తెలంగాణ ఉద్యమంలో ఆనాడు ఆర్టీసీ బస్ కా పయ్య నై చెలగ అని సమ్మె చేస్తే సింగరేణి సమ్మె చేస్తే దక్షిణ భారత దేశానికి విద్యుత్ ఆగిపోయే పరిస్థితి వచ్చింది తెలంగాణ ఏర్పాటు లో మనం అందరం కలిసి ఉద్యమించాం తెలంగాణ ఏర్పడిన తర్వాత మన సమస్యలు పరిష్కారం అవుతాయని అనుకున్నాం కానీ మన బతుకులు పెనం నుండి పోయిలో పడ్డట్టు బతుకులు దుర్భరంగా మారాయి ఆర్టీసీ 55 రోజులు సమ్మె చేసి 50 మంది చనిపోయిన పట్టించుకోలేదు.ప్రజా ప్రభుత్వం లో వారి సమస్యలు పరిష్కారం చేస్తున్నాం ఇప్పుడు సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారం చేస్తున్నాం గత 10 సంవత్సరాలుగా సింగరేణి లో జరిగిన అన్యాయాల పై కిషన్ రెడ్డి గారు ఎందుకు విచారణ కోరలేదు మా ప్రభుత్వం పారదర్శకంగా ఎక్కడ పొరపాటు లేకుండా సింగరేణి కార్మికులకు అండగా ఉంటుంది సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారం చేస్తుంది ప్రభుత్వం మీ పక్షాన ఉంటుంది.

## వీబీజీ రాంజీ స్కీంపై ...

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధి హామీ పథకానికి అవసరమైన నిధుల్లో కనీసం 60 శాతం కేంద్రం నుంచి అందాలంటే కొత్త విధానాన్ని అమలు చేయక తప్పదని అధికారులు సూచించారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు ఇప్పటికే కొత్త పథకం అమలుకు సంబంధించిన నోటిఫికేషన్లు జారీ చేస్తున్నాయని కూడా వివరించారు. ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చ జరిగింది.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, డిమాండ్ ఆధారంగా కాకుండా నార్మేటివ్ విధానంలో పనిదినాల కేటాయింపును ప్రతిపాదించడం సరికాదన్నారు. వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల పాటు ఉపాధి పనులకు విరామం ఇవ్వాలనే నిబంధనను తొలగించాలని కేంద్రాన్ని కోరనున్నట్లు తెలిపారు.పంటల సీజన్‌లోనే రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని, అదే సమయంలో వనమహోత్సవం, మొక్కల నాటకం వంటి కార్యక్రమాలు ఉపాధి హామీ పనుల ద్వారా చేపడతామని పేర్కొన్నారు. ఈ సమయంలో 60 రోజుల విరామం విధిస్తే మొక్కల నాటకం నిలిచిపోతుందని, అది కేంద్రం చేపట్టిన గ్రీన్ ఇండియా క్యాంపెయిన్ లక్ష్యాలకు కూడా విరుద్ధమని అన్నారు.ఆదివాసీ, కొండ ప్రాంతాల్లో పంటల సీజన్ 60 రోజుల పాటు కొనసాగదని, అలాంటి ప్రాంతాల్లో ఈ నిబంధన అమలు చేయడం ఆచరణ సాధ్యం కాదని పేర్కొన్నారు. ఒకసారి పనులు ప్రారంభమైన తర్వాత మధ్యలో 60 రోజుల విరామం ఇవ్వడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.ప్రస్తుతం కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు, భవనాలు, ఇతర నిర్మాణాలు పూర్తయ్యే వరకు వాటి నిధులను పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు తగిన వెసులుబాటు కల్పించేలా కొత్త చట్టం అమలును వాయిదా వేయాలని కేంద్రాన్ని కోరనున్నట్లు తెలిపారు. ఈ అభ్యంతరాలను లేఖ రూపంలో నిరసన తెలుపుతామన్నారు. అయితే, అనివార్య పరిస్థితుల్లో వీబీజీ రాంజీ విధానాన్ని అమలు చేయాల్సి వస్తే ఉపాధి కూలీలకు ఎలాంటి నష్టం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. కూలీలకు కలిగే నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసే విధంగా ముసాయిదా రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.కొత్త విధానం అమలుపై ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రివర్గంతో చర్చించిన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క వెల్లడించారు.

## గూడెంగుట్ట శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల విశ్వాసాలను గౌరవిస్తూ ఆధ్యాత్మికతతో పాటు సంక్షేమం, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి ఇప్పటికే రూ.2,216 కోట్లు కేటాయించగా, రాబోయే గోదావరి పుష్కరాల నిర్వహణకు రూ.1,000 కోట్లు, బాసర నుంచి భద్రాచలం వరకు ఆధ్యాత్మిక కారిడార్ అభివృద్ధికి రూ.802 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ గడ్డం వంశీ , ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావు, రాజ్ ఠాకూర్, గండ్ర సత్యనారాయణ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అమెరికాపై భారత్ తీవ్ర ఆగ్రహం

- భారత నావికుల మృతిపై ఆందోళన వ్యక్తం ఘటనపై పూర్తి వివరాలు కోరిన భారత్
- భారతీయుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి

**ఢిల్లీ వెలుతురు జూన్ 13:**

గల్ఫ్ ప్రాంతంలో భారతీయులు ఉన్న ఓడలపై జరిగిన దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందిన ఘటనపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో తో ఫోన్‌లో మాట్లాడి ఘటనపై భారత ప్రభుత్వ ఆందోళనను తెలియజేసినట్లు సమాచారం.మృతి చెందిన భారతీయ నావికుల కుటుంబాలకు సానుభూతి తెలిపిన జైశంకర్, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అందించాలని అమెరికా అధికారులను కోరినట్లు తెలుస్తోంది. భారతీయుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని కూడా ఆయన సూచించినట్లు సమాచారం.ఇదిలా ఉండగా, ఈ దాడులకు ఇరానే కారణమని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ఆరోపణలను ఇరాన్ రాయబార కార్యాలయం ఖండించింది.

ఈ ఘటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.ఒమన్ తీర ప్రాంతంలో జరిగిన ఈ ఘటన గల్ఫ్ ప్రాంత భద్రతా పరిస్థితులపై మరోసారి చర్చకు దారితీసింది. పరిస్థితులను భారత్ నిశితంగా పరిశీలిస్తోందని దౌత్య వర్గాలు తెలిపాయి.

## మోదీ గారి 12 ఏళ్లలో...

(మొదటి పేజీ తరువాయి)

అదిలాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం రోజున జరిగినమీడియా సమావేశంలోగోడం నగేష్ , పాయల్ శంకర్ లు రాష్ట్ర అధికార ప్రతినిధి అశోక్ ముస్తాపూరే అదిలాబాద్ జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద్ కలిసి మాట్లాడారు. గత 12 ఏళ్లలో ప్రధాని మోదీ బలమైన నాయకత్వం వల్ల అంతర్జాతీయంగా భారతదేశ గౌరవం, కీర్తి ప్రతిష్టలు మునుపెన్నడూ లేని విధంగా పెరిగాయని నేతలు కొనియాడారు. సబ్ కా సాథ్ - సబ్ కా వికాస్ ధ్యేయంగా మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోని ప్రతి పేదవాడికి, అట్టడుగు వర్గాల ప్రజలకు కొండంత అండగా నిలిచాయని స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ విప్లవం, రక్షణ రంగంలో స్వయం సమృద్ధి మరియు ఆర్థిక సంస్కరణలతో దేశం శరవేగంగా దూసుకుపోతోందన్నారు.

"గడిచిన 12 ఏళ్లలో మోదీ గారి నాయకత్వంలో దేశం సాధించిన అపూర్వ అభివృద్ధిని, సంక్షేమ పథకాల ఫలాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## ఫ్రాన్స్, స్లోవేకియా పర్యటనకు మోదీ

- 1993 తర్వాత ఆ దేశాన్ని సందర్శిస్తున్న తొలి భారత ప్రధాని
- అధ్యక్షుడు పెల్లెగ్రీని, ప్రధాని ఫికోతో భేటీలు
- జీ7 శిఖరాగ్ర సమావేశానికి వరుసగా ఎనిమిదోసారి ఆహ్వానం
- భారత్‌పై ప్రపంచ దేశాల విశ్వాసానికి నిదర్శనమన్న మోదీ
- గ్లోబల్ సౌత్ తరఫున గళం విప్పనున్న భారత్

**ఢిల్లీ వెలుతురు జూన్ 13:**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫ్రాన్స్, స్లోవేకియా దేశాల వారం రోజుల పర్యటనకు శనివారం బయలుదేరారు. ఈ పర్యటనలో భాగంగా జీ7 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడంతో పాటు పలువురు ప్రపంచ నాయకులతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. అంతర్జాతీయ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ, భద్రతా అంశాలు, వ్యూహాత్మక భాగస్వామ్యాలపై కీలక చర్చలు జరగనున్న నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.పర్యటనకు ముందు విడుదల చేసిన ప్రకటనలో ప్రధాని మోదీ, ఫ్రాన్స్ ను భారతదేశ వ్యూహాత్మక దార్శనికతలో అత్యంత కీలక భాగస్వామిగా అభివర్ణించారు. ఈ ఏడాది ప్రారంభంలో ఇరు దేశాల సంబంధాలను ప్రత్యేక ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి తీసుకెళ్లిన తర్వాత సాధించిన పురోగతిని సమీక్షించేందుకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ తో సమావేశం కానున్నట్లు తెలిపారు.ఈ భేటీలో రక్షణ, సాంకేతికత, అంతరిక్ష పరిశోధనలు,

వాణిజ్యం, ఇంధన భద్రత వంటి అంశాలతో పాటు పలు ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై చర్చ జరిగే అవకాశముందని దౌత్య వర్గాలు భావిస్తున్నాయి. భారత్-ఫ్రాన్స్ సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ఈ సమావేశం కీలకంగా మారనుంది.ఫ్రాన్స్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ స్లోవేకియాలో పర్యటించనున్నారు. 1993లో స్లోవేకియాకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వా

త ఆ దేశాన్ని సందర్శిస్తున్న తొలి భారత ప్రధానిగా మోదీ చరిత్ర సృష్టించనున్నారు. ఈ సందర్భంగా స్లోవేకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రినీ, ప్రధాని రాబర్ట్ ఫికోలతో సమావేశం కానున్నారు.స్లోవేకియాతో పెరుగుతున్న ద్వైపాక్షిక సంబంధాల నేపథ్యంలో ఈ పర్యటనను చారిత్రాత్మక మైలురాయిగా మోదీ అభివర్ణించారు. వాణిజ్యం, సాంకేతికత, తయారీ రంగం, రక్షణ సహకారం తదితర అంశాల్లో ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ఈ పర్యటన దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఇదిలా ఉండగా, ఫ్రాన్స్‌లోని ఎవియాన్‌లో నిర్వహిస్తున్న జీ7 సమ్మిట్ లో భారత్ పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. వరుసగా ఎనిమిదోసారి జీ7 సమావేశానికి ఆహ్వానం అందుకోవడం భారత్ పెరుగుతున్న అంతర్జాతీయ ప్రాధాన్యానికి నిదర్శనమని ప్రధాని మోదీ పేర్కొన్నారు.భారత్‌పై అంతర్జాతీయ భాగస్వాములు ఉంచిన విశ్వాసం, ప్రపంచ వేదికపై దేశ ప్రభావం విస్తరిస్తున్నదనే విషయాన్ని ఈ ఆహ్వానం ప్రతిబింబిస్తోందని ఆయన అన్నారు. జీ7 వేదికపై భారత్ తన జాతీయ ప్రయోజనాలను మాత్రమే కాకుండా అభివృద్ధి చెందుతున్న దేశాల సమూహమైన గ్లోబల్ సౌత్ ఆకాంక్షలను కూడా ప్రపంచం ముందుకు తీసుకెళ్తుందని స్పష్టం చేశారు."జీ7లో భారత్ తన స్వరాన్ని మాత్రమే వినిపించదు. గ్లోబల్ సౌత్ దేశాల ఆశయాలు, అవసరాలు, సవాళ్లకు కూడా ప్రాతినిధ్యం వహిస్తుంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిణామాల నేపథ్యంలో జరుగుతున్న ఈ పర్యటన భారత్-యూరప్ సంబంధాలకు కొత్త ఊపు తీసుకురావడంతో పాటు అంతర్జాతీయ వేదికలపై భారత పాత్రను మరింత బలోపేతం చేసే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అరవింద్ మాటలు చూస్తేనే అర్థం అవుతుంది కదా

- వచ్చే ఎన్నికల్లో ఏమని ఓటు అడుగుతారు ?
- బెంగాల్ లో టీఎంసీ కాంగ్రెస్ లో విలీనం పై క్లారిటీ లేదు
- క్లారిటీ వచ్చాక మాట్లాడతా
- ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామని హరీష్ మాట్లాడటం మూర్ఖత్వం
- కేటీఆర్ పర్సనల్ కోపంతో రేవంత్ పై మాట్లాడుతున్నారు
- కేటీఆర్ బస్సు యాత్ర చేస్తే ఏమొస్తుంది?
- పాదయాత్ర చేసిన మిమ్మల్ని ఎవరు ఆదరించరు
- రాష్ట్రాన్ని ముంచిన వారు పాదయాత్రలు చేసి ఏమి చేస్తారు ?
- జీవన్ రెడ్డి ది మా పార్టీలో ముగిసిన అధ్యాయం
- టీపీసీసీ అధ్యక్షులు, ఏమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



# టీవీకే జిరాక్స్ కాపీలా బీజేపీ

- టీవీకేపై విరుచుకుపడిన ఎంకే స్టాలిన్
- మహిళల భద్రత అంశంపై విజయ్‌ను నిలదీత
- టీవీకే కార్యకర్తలపై వస్తున్న ఆరోపణలను ప్రస్తావించిన డీఎంకే అధినేత
- ఎమ్మెల్యేలను ఆకర్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ విమర్శలు
- సొంత పార్టీ కార్యకర్తలపై విజయ్‌కు నమ్మకం లేదన్న స్టాలిన్
- ఇతర రాష్ట్రాల్లో బీజేపీ అనుసరించే విధానాన్నే టీవీకే అనుసరిస్తోందని ఆరోపణ
- టీవీకేను బీజేపీ జిరాక్స్ కాపీగా అభివర్ణించిన డీఎంకే నేత
- ఎన్నికల తర్వాత పార్టీ మార్పులపై ప్రశ్నలు
- కరూర్ సీబీఐ విచారణ అంశాన్ని ప్రస్తావించిన స్టాలిన్

**చెన్నై వెలుతురు జూన్ 13:**

తమిళనాడు రాజకీయాల్లో అధికార డీఎంకే, తమిళగ వెట్రి కళగం (టీవీకే) మధ్య విమర్శల పర్వం మరింత ముదిరింది. డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ టీవీకే అధ్యక్షుడు విజయ్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. చెన్నైలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, టీవీకే పార్టీపై పలు ఆరోపణలు చేస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు.టీవీకేకు ఓటు వేసిన ప్రజలు ఇప్పుడు తాము ఆ పార్టీకి ఎందుకు ఓటు వేశామా అని ఆలోచిస్తున్న పరిస్థితి ఏర్పడిందని స్టాలిన్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో నేరాల సంఖ్య పెరిగిందని ఆరోపిస్తూ, ఎన్నికల సమయంలో మహిళల భద్రతపై టీవీకే అధినేత విజయ్ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు.మహిళలు, బాలికలకు తమ పార్టీ కార్యకర్తలే రక్షణగా ఉంటారని విజయ్ ఎన్నికల ప్రచార సమయంలో ప్రకటించారని స్టాలిన్ అన్నారు. అయితే ప్రస్తుతం టీవీకే కార్యకర్తలపైనే లైంగిక నేరాలకు సంబంధించిన ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో మహిళలను టీవీకే కార్యకర్తల నుంచే రక్షించాల్సిన అవసరం వచ్చిందంటూ ఆయన విమర్శించారు.అంతేకాకుండా, టీవీకే అధినేత విజయ్ ప్రత్యర్థి పార్టీల ఎమ్మెల్యేలను తమ పార్టీలోకి ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

ముఖ్యంగా అన్నాడీఎంకే ఎమ్మెల్యేలతో సంప్రదింపులు జరుపుతున్నారని పేర్కొన్నారు. తన సొంత పార్టీ కార్యకర్తలపై విజయ్‌కు పూర్తి నమ్మకం లేదని, అందుకే ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.

ఇతర రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ అనుసరించే రాజకీయ వ్యూహాలను తమిళనాడులో టీవీకే అమలు చేస్తోందని స్టాలిన్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో టీవీకేను బీజేపీ జిరాక్స్ కాపీగా అభివర్ణించారు. బీజేపీ ఇతర రాష్ట్రాల్లో అనుసరించే రాజకీయ విధానాలనే విజయ్ తమిళనాడులో అమలు చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు.ఎన్నికల్లో గెలిచిన కొందరు ప్రజాప్రతినిధులు ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా పార్టీలు మారుతున్నారని స్టాలిన్ విమర్శించారు. ప్రజలు ఓటు వేసి ఎన్నుకున్న కొద్ది కాలానికే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరుతున్నారంటూ ఆయన ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయ పడ్డారు.కరూర్ సీబీఐ విచారణ అంశాన్ని కూడా స్టాలిన్ ప్రస్తావించారు. విజయ్ ఇటీవల ఢిల్లీ పర్యటనను ఉద్దేశించి వ్యాఖ్యలు చేసిన ఆయన, ఆ పర్యటన వెనుక ఉద్దేశం ఏమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కరూర్ సీబీఐ విచారణ నుంచి బయటపడేందుకే ఢిల్లీ వెళ్లారా అని ప్రశ్నించారు.స్టాలిన్ చేసిన ఈ వ్యాఖ్యలు తమిళనాడు రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. ఇప్పటికే రాష్ట్ర రాజకీయాల్లో కొత్త శక్తిగా ఎదగాలని ప్రయత్నిస్తున్న టీవీకేపై డీఎంకే విమర్శల దాడిని మరింత తీవ్రతరం చేసినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.మరోవైపు, స్టాలిన్ చేసిన ఆరోపణలపై టీవీకే నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది. రాబోయే రోజుల్లో ఈ అంశంపై రాజకీయ వాగ్వాదం మరింత ముదిరే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నికల రాజకీయాలు వేడెక్కుతున్న తరుణంలో ప్రధాన పార్టీల మధ్య మాటల యుద్ధం మరింత ఉధృతమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

# జూన్ 15 నుంచి విద్యార్థులకు పోషకాహార అల్పాహారం

- తెలంగాణలో తొలి దశలో 1,269 పాఠశాలలు, 33 జూనియర్ కళాశాలల్లో అమలు
- పాలు, రాగి జావతో కూడిన పోషకాహార మెనూ
- హాజరు, ఏకాగ్రత, అభ్యసన సామర్థ్యాల పెంపే లక్ష్యం
- పేద కుటుంబాల విద్యార్థులకు మరింత మేలు

**హైదరాబాద్, వెలుతురు జూన్ 13:**



విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహార స్థాయిని మెరుగుపర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 'అల్పాహారం పథకం'ను జూన్ 15 నుంచి అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. తొలి దశలో 1,269 ప్రభుత్వ పాఠశాలలు, 33 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ పథకం అమల్లోకి రానుంది.

విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం, వారి శారీరక, మానసిక వికాసానికి తోడ్పడడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. పథకం కింద ప్రతిరోజూ పోషక విలువలు కలిగిన అల్పాహారంతో పాటు పాలు, రాగి జావ అందించనున్నారు. ముఖ్యంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది.

విద్యార్థుల హాజరు శాతం పెరగడం, పాఠాలపై ఏకాగ్రత పెంపొందడం, అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఇప్పటికే ఎంపిక చేసిన పాఠశాలలు, కళాశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, వంట ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

అల్పాహారం తయారీలో నాణ్యత, పరిశుభ్రత, పోషక విలువలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. స్థానికంగా అందుబాటులో ఉండే రాగి వంటి పోషకాహార పదార్థాలను మెనూలో చేర్చడం ద్వారా విద్యార్థులకు సమతుల్య ఆహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

ఈ పథకం వల్ల ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా లబ్ధి పొందనున్నారని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పేద కుటుంబాల పిల్లలు ఖాళీ కడుపుతో పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితులు తగ్గి, ఆరోగ్యంగా, ఉత్సాహంగా విద్యను అభ్యసించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

విద్యా నిపుణులు ఈ కార్యక్రమాన్ని తెలంగాణ విద్యా రంగంలో ఒక కీలక ముందడుగుగా అభివర్ణిస్తున్నారు. విద్యార్థుల శారీరక దృఢత్వం, మానసిక వికాసం, విద్యా ఫలితాల మెరుగుదలకు ఈ పథకం దోహదపడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

మొదటి దశ అమలు ఫలితాలను సమీక్షించిన అనంతరం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు ఈ పథకాన్ని దశలవారీగా విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. పథకం అమలును అన్ని స్థాయిల్లో నిరంతరం పర్యవేక్షిస్తూ, సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

అల్పాహారం పథకం విజయవంతమైతే రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఇది ఒక మైలురాయిగా నిలిచే అవకాశముందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# మళ్లీ కుండపోతకు సిద్ధం కండి!

- హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- మరో రెండు రోజులపాటు భారీ వర్షాల హెచ్చరిక
- ఈదురుగాలులు, ఉరుములు—మెరుపులతో వర్షాలు
- శంషాబాద్‌లో వాతావరణ ప్రభావం.. సీఎం విమానం బెంగళూరుకు మళ్లింపు

**హైదరాబాద్, వెలుతురు జూన్ 13:**



తెలంగాణలో మరోసారి భారీ వర్షాలు కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో ఇప్పటికే వర్షాలు ప్రారంభమవగా, రానున్న రెండు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు.

శుక్రవారం రాత్రి భాగ్యనగరాన్ని భారీ వర్షం అతలాకుతలం చేసింది. నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలిగింది. కొండాపూర్ ప్రాంతంలో గంటన్నర వ్యవధిలోనే 8.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు స్థానిక వర్గాలు తెలిపాయి. లోతట్టు ప్రాంతాల్లో నీటిమునిగిన పరిస్థితులు నెలకొనడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

హైదరాబాద్ శివారు ప్రాంతాలతో పాటు వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోనూ కుండపోత వర్షం కురుస్తోంది. పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి పడగా, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినట్లు సమాచారం. వర్ష ప్రభావంతో రహదారులపై ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

భారీ వర్షాల ప్రభావం విమాన రాకపోకలపై కూడా పడింది. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయాణిస్తున్న ఇండిగో విమానం శంషాబాద్ విమానాశ్రయంలో దిగాల్సి ఉండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా బెంగళూరుకు మళ్లించారు. శంషాబాద్ పరిసరాల్లో భారీ వర్షం, బలమైన ఈదురుగాలులు కొనసాగడంతో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సూచనల మేరకు పైలట్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు.

ఇదిలా ఉండగా, నైరుతి రుతుపవనాలు తెలంగాణలో మరింత చురుగ్గా విస్తరిస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కొనసాగనున్నాయని అంచనా వేసింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, చెట్ల కింద నిలబడవద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

అదే సమయంలో దేశవ్యాప్తంగా రుతుపవనాలపై ఎల్‌నినో ప్రభావం పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రానున్న నెలల్లో 'సూపర్ ఎల్‌నినో' పరిస్థితులు ఏర్పడితే కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం అసమానంగా ఉండే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం తెలంగాణలో మాత్రం నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కొనసాగనున్నాయని స్పష్టం చేశారు.

# హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు హైకోర్టు షాక్

- కోర్టు ఆదేశాల అమలులో జాప్యంపై రూ.50 వేల జరిమానా
- జరిమానా చెల్లించిన తర్వాతే కౌంటర్ల స్వీకరణకు ఆదేశాలు
- స్టేటస్‌కో ఉల్లంఘన ఆరోపణలపై తీవ్ర ఆగ్రహం
- జూన్ 15న కేసు తుది విచారణ

**హైదరాబాద్, వెలుతురు జూన్ 13:**



హైదరాబాద్‌లో చెరువుల సంరక్షణ, అక్రమ నిర్మాణాల తొలగింపులో కీలక పాత్ర పోషిస్తున్న హైడ్రా సంస్థకు తెలంగాణ హైకోర్టు గట్టి హెచ్చరిక జారీ చేసింది. కోర్టు ఆదేశాలను సకాలంలో అమలు చేయకపోవడం, పలు మార్లు అవకాశాలు ఇచ్చినా సరైన కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయకపోవడంపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు రూ.50 వేల జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని ప్రధాన న్యాయమూర్తి సహాయ నిధికి జమ చేసిన తర్వాత మాత్రమే హైడ్రా తరఫు కౌంటర్లను స్వీకరించాలని రిజిస్ట్రీకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన విచారణలో వెంగళరావునగర్‌లోని సర్వే నంబర్ 45లో ఉన్న రెండెకరాల భూమి వివాదం ప్రధాన అంశంగా నిలిచింది. ఈ భూమికి సంబంధించి మహమ్మద్ షఫీహతుల్లా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ కొనసాగుతోంది. గతంలో కోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, హైడ్రా అధికారులు ఆదేశాలను పట్టించుకోకుండా చర్యలు చేపట్టారనే ఆరోపణలు వినిపించాయి.

పిటిషనర్ వాదన ప్రకారం, మార్చి 18న హైడ్రా సిబ్బంది వివాదాస్పద స్థలంలోకి ప్రవేశించి కాంపౌండ్ వాల్‌ను కూల్చివేయడంతో పాటు ఆ స్థలం హైడ్రా పరిధిలో ఉందని పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. కోర్టు స్టేటస్‌కో ఆదేశాలు అమల్లో ఉన్న సమయంలో ఈ చర్యలు చేపట్టడం న్యాయస్థాన ఆదేశాల ఉల్లంఘనగా భావిస్తూ వివరణ కోరింది.

ఈ ఆరోపణలపై సమగ్ర వివరణ ఇవ్వాలని కోర్టు పలుమార్లు ఆదేశించినప్పటికీ హైడ్రా అధికారులు సకాలంలో స్పందించలేదని న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటికే ఒక దశలో కమిషనర్ వ్యక్తిగత హాజరుపై కూడా హెచ్చరికలు జారీ చేసినట్లు విచారణ సందర్భంగా వెల్లడైంది.

ఇటీవలి విచారణలో హైడ్రా తరఫు న్యాయవాది కౌంటర్లు దాఖలు చేసినట్లు కోర్టుకు తెలియజేశారు. అయితే రిజిస్ట్రీ పరిశీలనలో అవి సాంకేతిక లోపాలతో తిరస్కరించబడ్డాయని తేలింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయమూర్తి, కోర్టు ప్రక్రియలను నిర్లక్ష్యం చేసినందుకు జరిమానా విధిస్తూ కఠిన ఆదేశాలు జారీ చేశారు.

హైదరాబాద్ నగరంలో చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపులో హైడ్రా చేపడుతున్న చర్యలకు ప్రాధాన్యం ఉన్నప్పటికీ, న్యాయస్థాన ఆదేశాల అమలులో నిర్లక్ష్యం సహించబోమని ఈ తీర్పు ద్వారా హైకోర్టు స్పష్టం చేసినట్లు న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అభివృద్ధి కార్యక్రమాలు, చట్టపరమైన నిబంధనల అమలు పరస్పర సమన్వయంతో సాగాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తు చేసింది.

ఈ కేసుకు సంబంధించి తదుపరి మరియు తుది విచారణ జూన్ 15న జరగనుంది. అప్పటిలోగా జరిమానా చెల్లించి, లోపరహిత కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేసిన పక్షంలోనే కేసు విచారణ తదుపరి దశకు వెళ్లే అవకాశం ఉందని న్యాయవర్గాలు పేర్కొంటున్నాయి.

# మీనాక్షి కోసం కాంగ్రెస్ కొత్త వ్యూహం

- తెలంగాణ నుంచి పెద్దల సభకు పంపే యోచనలో కాంగ్రెస్
- నామినేషన్ వివాదం తర్వాత కొత్త వ్యూహానికి శ్రీకారం
- సిట్టింగ్ ఎంపీ రాజీనామాపై జోరుగా చర్చ
- తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానం చేతుల్లోనే

**హైదరాబాద్, వెలుతురు జూన్ 13:**



తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా ఉన్న మీనాక్షి నటరాజన్‌ను రాజ్యసభకు పంపేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కొత్త వ్యూహంపై కసరత్తు చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు పోటీ చేయాలన్న ప్రయత్నం నామినేషన్ దశలోనే విఫలమైన నేపథ్యంలో, ఇప్పుడు తెలంగాణ నుంచే ఆమెను పెద్దల సభకు పంపే అవకాశాలపై పార్టీ నాయకత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

మధ్యప్రదేశ్‌లో మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురికావడం కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ ఆశించిన ఫలితం రాకపోవడంతో పార్టీ నాయకత్వం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో బీజేపీ ప్రమేయం ఉందని కాంగ్రెస్ ఆరోపిస్తుండగా, తెలంగాణ కాంగ్రెస్ నేతల సమన్వయ లోపం కూడా పరిస్థితిని క్లిష్టం చేసిందనే విమర్శలు పార్టీ అంతర్గతంగా వినిపిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో మీనాక్షి నటరాజన్‌కు రాజకీయంగా తగిన ప్రాధాన్యం కల్పించాలనే ఉద్దేశంతో తెలంగాణ నుంచి రాజ్యసభకు పంపే ప్రతిపాదన తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తెలంగాణకు చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యుల్లో నలుగురు కాంగ్రెస్ పార్టీకి చెందినవారు. వారిలో ఎవరైనా స్వచ్ఛందంగా పదవికి రాజీనామా చేస్తే ఖాళీ అయ్యే స్థానానికి జరిగే ఉప ఎన్నికలో మీనాక్షిని బరిలోకి దింపే అవకాశాలను పార్టీ పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ప్రస్తుతం కాంగ్రెస్ తరఫున అనిల్ కుమార్ యాదవ్, రేణుకా చౌదరి, అభిషేక్ మను సింఘ్వీ, వేమిరెడ్డి నరేంద్రరెడ్డి రాజ్యసభ సభ్యులుగా కొనసాగుతున్నారు. వీరిలో ఒకరు పార్టీ ప్రయోజనాల దృష్ట్యా రాజీనామా చేసే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితులుగా భావించే ఇద్దరు నేతల పేర్లు ప్రచారంలో ఉండటం రాజకీయ ఆసక్తిని మరింత పెంచుతోంది.

మీనాక్షి నటరాజన్‌కు రాజ్యసభ అవకాశం కల్పించడం ద్వారా కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద తెలంగాణ నాయకత్వానికి మరింత విశ్వసనీయత పెరుగుతుందని కొందరు నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న మీనాక్షికి ఈ అవకాశాన్ని కల్పించడం ద్వారా పార్టీ అంతర్గత సమీకరణాలకు కూడా మేలు జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


# ఇరాన్ నుంచి భారత్‌కు భారీ గుడ్ న్యూస్.. చౌకగా చమురు దిశగా కొత్త ఆశలు!

- అమెరికా—ఇరాన్ శాంతి ఒప్పందం దిశగా అడుగులు
- చమురు ధరలు తగ్గే అవకాశం.. భారత్‌కు ఊరట సంకేతాలు
- చాబహార్ పోర్ట్ ప్రాజెక్ట్ మళ్లీ ఊపందుకునే ఛాన్స్
- వ్యూహాత్మకంగా భారత్‌కు గ్లోబల్ ప్రయోజనాలు

**న్యూఢిల్లీ, వెలుతురు జూన్ 13:**

అమెరికా—ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరే దిశగా జరుగుతున్న చర్చలు అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారాయి. ఈ పరిణామాలు భారతదేశానికి కూడా వ్యూహాత్మకంగా, ఆర్థికంగా ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. ముఖ్యంగా ఇరాన్‌తో చమురు వాణిజ్యం తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉండటంతో, దేశంలో ఇంధన ధరలు తగ్గే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి.అంతర్జాతీయ ఆంక్షల కారణంగా గత కొన్ని సంవత్సరాలుగా భారత్—ఇరాన్ మధ్య చమురు వాణిజ్యం పూర్తిగా నిలిచిపోయింది. ఒకప్పుడు బలంగా ఉన్న ఇంధన భాగస్వామ్యం 2020 నాటికి సున్నా స్థాయికి పడిపోయింది. అయితే తాజా శాంతి ఒప్పంద చర్చలు విజయవంతమైతే, తక్కువ ధరకు ముడి చమురు, సహజ వాయువు దిగుమతులకు మార్గం సుగమం కావచ్చని నిపుణులు భావిస్తున్నారు.ఇరాన్ చమురు తక్కువ సల్ఫర్ కంటెంట్ కలిగి ఉండటం వల్ల శుద్ధి ఖర్చులు కూడా తక్కువగా ఉంటాయని, దీని ప్రభావం పెట్రోల్—డీజిల్ ధరలపై కనిపించవచ్చని అంచనా వేస్తున్నారు.

భారత్ తన ఇంధన అవసరాల కోసం సుమారు 85 శాతం దిగుమతులపై ఆధారపడుతున్న నేపథ్యంలో ఈ పరిణామం కీలకంగా మారనుంది.అదే సమయంలో ఇరాన్‌లోని వ్యూహాత్మక చాబహార్ నౌకాశ్రయ ప్రాజెక్ట్ కూడా మళ్లీ వేగం పుంజుకునే అవకాశం ఉంది. గతంలో అమెరికా ఆంక్షల కారణంగా నిలిచిపోయిన ఈ ప్రాజెక్ట్, భారత్‌కు మధ్య ఆసియా, యూరప్ మరియు ఆఫ్రికా మార్కెట్లకు ప్రత్యక్ష మార్గాన్ని అందించగలదని భావిస్తున్నారు. ఇది ప్రాంతీయ వాణిజ్య సమీకరణాలను



మార్చే సామర్థ్యం కలిగి ఉంది.భౌగోళిక రాజకీయ పరంగా కూడా ఈ ఒప్పందం భారత్‌కు లాభదాయకంగా మారే అవకాశం ఉంది. హార్ముజ్ జలసంధి ద్వారా జరుగుతున్న చమురు రవాణాపై ఒత్తిడి తగ్గితే సరఫరా స్థిరత్వం పెరుగుతుంది. అలాగే గ్లోబల్ చమురు మార్కెట్‌లో ధరల ఒడిదొడుకులు తగ్గే అవకాశాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.ఇప్పటికీ అధికారికంగా ఒప్పందం ఖరారు కాకపోయినప్పటికీ, శాంతి చర్చలు సానుకూలంగా ముందుకు సాగితే భారత్‌కు ఇంధన భద్రత, వాణిజ్య విస్తరణ, వ్యూహాత్మక ప్రయోజనాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.


# ఆ నంబర్‌తో మెసేజ్‌లు వస్తే దయచేసి నమ్మొద్దు..



ప్రస్తుత రోజుల్లో సెలబ్రిటీల పేర్లను వాడుకుని అమాయక ప్రజలను మోసం చేసే కేటుగాళ్ల సంఖ్య బాగా పెరిగిపోయింది. ఇప్పటికే ఎంతోమంది హీరో, హీరోయిన్ల ఫేక్ ప్రొఫైల్స్ క్రియేట్ చేసి భారీగా డబ్బులు వసూలు చేసిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ విషయాన్ని కొందరు తాజాగా, ఈ సైబర్ నేరగాళ్ల బారిన టాలీవుడ్ లక్కీ బ్యూటీ మీనాక్షి చౌదరి పడింది. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఆమె పేరుతో ఒక ఫేక్ వాట్సాప్ నంబర్‌ను క్రియేట్ చేసి, కొందరికి మెసేజ్‌లు పంపుతూ డబ్బులు అడుగుతున్నట్లు ఆమె దృష్టికి వచ్చింది. ఈ మోసం గురించి తెలుసుకున్న మీనాక్షి చౌదరి వెంటనే అప్రమత్తమై తన అభిమానులను అలర్ట్ చేసింది. తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెడుతూ.. "నా పేరుతో ఫేక్ నంబర్ ఉపయోగించి కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. కాబట్టి నా అభిమానులు, నెటిజన్లు ఎవరూ వారిని నమ్మి మోసపోవద్దు. ముఖ్యంగా 7604891175 అనే నంబర్ నుండి మీకు ఎలాంటి మెసేజ్‌లు లేదా కాల్స్ వచ్చినా వెంటనే స్పందించకండి. ఆ నంబర్ నాది కాదు. ఒకవేళ ఆ నంబర్ నుండి మీకు మెసేజ్ వస్తే దయచేసి నాకు తెలియజేయండి. ఈ సమాచారాన్ని ఇతరులతో పంచుకున్న వారందరికీ ధన్యవాదాలు" అని రాసుకొచ్చింది. మీనాక్షి స్వయంగా స్పందించడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం మీనాక్షి పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఇండస్ట్రీలోని అసలైన స్టార్‌డమ్ గురించి చెబుతూ.. "సినిమా పరిశ్రమలో కొంతమంది నటులకు సోషల్ మీడియాలో కేవలం 5 మిలియన్ల మంది ఫాలోవర్లు మాత్రమే ఉంటారు. కానీ థియేటర్లలో వారి సినిమాలకు విపరీతమైన క్రేజ్ ఉంటుంది.

కోలీవుడ్ యంగ్ బ్యూటీ మాళవిక వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ స్టార్ హీరోల సరసన లక్కీ చాన్స్ కొట్టేస్తున్నారు. ఇటీవల 'ది రాజాసాబ్' సినిమాతో ప్రేక్షకులను అలరించారు. ప్రస్తుతం విలక్షణ దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా దర్శకత్వంలో రాబోతున్న 'పాకెట్ నోవెల్' మూవీలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి హీరోగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో వచ్చిన 'సూపర్ డీలక్స్' వంటి కల్ట్ క్లాసిక్ హిట్ తర్వాత విజయ్ సేతుపతి, దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది కావడంతో ప్రకటన రోజు నుంచే అందరిలోనూ ఆసక్తి మొదలైంది.

టైలర్ డర్డెన్ అండ్ కింగ్ ఫిస్ట్ బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకుని, షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. తాజాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ షూటింగ్‌లో హీరోయిన్ మాళవిక మోహనన్ కూడా అడుగుపెట్టింది. ఈ విషయాన్ని మాళవిక ట్విట్టర్ ద్వారా వెల్లడించింది. షూటింగ్ సెట్స్‌లో దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజాతో కలిసి దిగిన ఒక ఆసక్తికరమైన ఫొటోను షేర్ చేసింది. ఎంతో ప్రతిభావంతుడైన దర్శకుడితో కలిసి పని చేయడం సంతోషంగా ఉందంటూ పెట్టిన ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ చిత్రానికి లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఇళయరాజా సంగీతం అందిస్తుండగా.. కన్నడ స్టార్ రాజ్ బి. శెట్టి విలన్ పాత్రలో నటిస్తున్నారు.




'పాకెట్ నోవెల్' సినిమా షూటింగ్‌లో జాయిన్ అయిన మాళవిక మోహనన్..

# మరోసారి వాయిదా పడిన లెనిన్.. కొత్త రిలీజ్ డేట్ ప్రకటించిన నాగార్జున

అక్కినేని ఫ్యాన్స్‌ను నిరాశపర్చుతూ 'లెనిన్' మరోసారి వాయిదా పడింది. అక్కినేని హీరో అఖిల్, యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న చిత్రం 'లెనిన్'. 'వినరో భాగ్యము విష్ణు కథ' ఫేమ్ మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం అఖిల్ కెరీర్‌లో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోండగా.. అభిమానులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ ఈ మూవీ మాత్రం ఎప్పటికప్పుడు వాయిదా పడుతూనే వస్తుంది. ఎన్నో వాయిదాల తర్వాత జూన్ 26న రిలీజ్‌కు సిద్ధమైన ఈ చిత్రం మరోసారి వాయిదా పడినట్లు గతకొద్ది రోజులుగా వార్తలు రాగా.. ఫైనల్‌గా వాయిదాపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చింది. ఈ మేరకు అక్కినేని నాగర్జున సోషల్ మీడియాలో వేదికగా ప్రకటిస్తూ.. ''టీమ్ లెనిన్' నా దగ్గరకు ఒక అభ్యర్థనతో వచ్చింది. తమ వంతుగా 100% కృషి చేసి, ఇంకొంచెం బెటర్‌గా రూపొందించడానికి వారు మరికొంత సమయం అడిగారు. వారి అంకితభావం, ఉత్సాహం చూసి నేను సరేనన్నాను. జులై 10న 'మనోడు' రాబోతున్నాడు. మరోసారి చెబుతున్నాను, మీరు ఒక కొత్త అఖిల్‌ను చూడబోతున్నారు.. లెనిన్ అనుభూతి కోసం సిద్ధంగా ఉండండి' అంటూ తెలిపాడు.






# నాగార్జున ఆ సినిమాను లైట్ తీసుకున్నాడా?

టాలీవుడ్ కింగ్ నాగార్జున కొన్ని సంవత్సరాల క్రితం 'సొగ్గాడే చిన్నినాయనా' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీలో రమ్యకృష్ణ, లావణ్య త్రిపాఠి హీరోయిన్లుగా నటించారు. ఈ సినిమా 2016 సంక్రాంతి కానుకగా విడుదలై మంచి విజయాన్ని సాధించింది. ఈ చిత్రానికి కొనసాగింపుగా నాగార్జున, నాగచైతన్య హీరోలుగా, రమ్యకృష్ణ, కృతి శెట్టి హీరోయిన్లుగా కళ్యాణ్ కృష్ణ 'బంగార్రాజు' చిత్రాన్ని తెరకెక్కించాడు. ఈ మూవీ 2022 సంక్రాంతి సందర్భంగా విడుదలై ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందింది. ఇక 'సొగ్గాడే చిన్నినాయనా', 'బంగార్రాజు' చిత్రాలకు సీక్వెల్‌గా మరో సినిమాను రూపొందించనున్నట్లు, దానికి కూడా కళ్యాణ్ కృష్ణ దర్శకత్వం వహించనున్నట్లు అన్నపూర్ణ స్టూడియోస్ నుంచి గతంలో ప్రకటన వెలువడింది.

అలాగే ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని వార్తలు వినిపించాయి. అయితే ఇప్పటికే ఈ ఏడాది సగం పూర్తవగా, సంక్రాంతికి కూడా ఎక్కువ సమయం లేకపోయినా ఇప్పటివరకు నాగార్జున – కళ్యాణ్ కృష్ణ కాంబినేషన్ మూవీ షూటింగ్ ప్రారంభం కాలేదు. ప్రస్తుతం నాగార్జున, రా కార్తీక్ దర్శకత్వంలో రూపొందుతున్న తన 100వ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. ఈ ప్రాజెక్ట్‌పైనే ఆయన పూర్తి దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దాంతో కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో రూపొందనున్న సినిమాను ప్రస్తుతానికి నాగార్జున పక్కన పెట్టినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.


# 'ఓ సుకుమారి' టీజర్ విడుదల.. సర్‌ప్రైజులు, షాకింగ్ ట్విస్ట్‌లతో హైప్ క్రియేట్!




టాలీవుడ్ యంగ్ హీరో తిరువీర్, ఐశ్వర్య రాజేష్ కాంబోలో రాబోతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఓ..!సుకుమారి'. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని మహేశ్వర రెడ్డి మాలి నిర్మిస్తున్నారు. భరత్ దర్శన్ ఈ సినిమా ద్వారా ఇండస్ట్రీకి దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈక్రమంలో.. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన టీజర్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. టీజర్ చూస్తుంటే ఈ సినిమా అందమైన గ్రామీణ నేపథ్యంలో సరికొత్తగా, ఎంతో ఆహ్లాదకరంగా సాగనున్నట్లు స్పష్టమవుతోంది. ఒక సున్నితమైన, మధురమైన ప్రేమకథతో పాటు కథలో ఆశ్చర్యపరిచే మలుపులు కూడా ఉన్నట్లు మేకర్స్ చూపించారు. ఇందులో తిరువీర్ పల్లెటూరి రాజకీయాల్లో పాల్గొనే యాదగిరి అనే యువకుడిగా కనిపించగా.. ఐశ్వర్య రాజేష్ పక్కా మాస్ పల్లెటూరి అమ్మాయి దామిని పాత్రలో కనిపించి మెప్పించింది.

తనదైన చురుకుదనం, అల్లరి మాటలతో ఊరి జనాన్ని ఇబ్బంది పెట్టే పాత్రలో ఆమె నటన ఆకట్టుకుంది. కథ విషయానికి వస్తే.. ఊరిలో అందరినీ ఆటపట్టించే ఐశ్వర్య రాజేష్‌ను అమితంగా ఆరాధించే తిరువీర్, ఆమెను తనతో పాటు పాలిటిక్స్‌లోకి తీసుకువస్తాడు. ఈ క్రమంలోనే వారిద్దరి మధ్య ప్రేమ చిగురించి, అది పెళ్లికి దారితీస్తుంది. వివాహం తర్వాత వారిద్దరూ రాజకీయాల్లో విజయం సాధించారా? అసలు ఊరి ప్రజలు వీరిద్దరిని ఎందుకు తరుముతున్నారు? వీరి జీవితాల్లో ఎలాంటి ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయి? అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సినిమా రాబోతుంది. ఇక ఇందులో సర్‌ప్రైజులు షాకింగ్ ట్విస్ట్‌లు కూడా ఉండనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కాబోతున్న ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. పాపులర్ లిరిక్ రైటర్ పూర్ణచారి ఈ చిత్రంలోని అన్ని పాటలకు సాహిత్యం అందించడం విశేషం.

# నా కథని సినిమాగా తీయాలంటే.. రెండు భాగాలుగా తీయాలి!



"అందర్నీ షాక్‌కి గురి చేసే సినిమా 'రావు బహదూర్" అన్నారు సత్యదేవ్. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ సినిమాని వెంకటేశ్ మహా తెరకెక్కించారు. మహేశ్‌బాబు - నమ్రత శిరోద్కర్ జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో చింతా గోపాలకృష్ణ రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర నిర్మించారు. దీపా థామస్ కథానాయిక. ఈ సినిమా జులై 3న రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం హైదరాబాద్‌లో టీజర్‌ను విడుదల చేశారు. ఈ ప్రచార చిత్రాన్ని బట్టి.. ఇదొక సైకలాజికల్ ఫాంటసీ థ్రిల్లర్‌గా ముస్తాబైనట్లు అర్థమవుతోంది. "నా కథ గానీ సినిమాగా తీయాలంటే.. కనీసం రెండు భాగాలుగా తీయాలి తెలుసా" అంటూ ఆఖర్లో సత్య చెప్పిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. అనంతరం హీరో సత్యదేవ్ మాట్లాడుతూ.. "ఈ ఏడాదిలోని అన్ని శుక్రవారాల కంటే ఈ సినిమా వచ్చే శుక్రవారం పూర్తి భిన్నంగా ఉండనుంది" అన్నారు.

# ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాల కార్మికత్వం నుంచి ఆరు మంది చిన్నారులను రక్షించిన స్కోప్ సంస్థ, జిల్లా యంత్రాంగం పోలీసులు

**సంగారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 13:**

ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని, స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్), జిల్లా యంత్రాంగం, పోలీసు అధికారుల సహకారంతో నిర్వహించిన సంయుక్త తనిఖీ, అమలు చర్యల ద్వారా బాల కార్మికత్వంలో ఉన్న ఆరు మంది చిన్నారులను విజయవంతంగా రక్షించింది.ఈ రక్షణ చర్య ప్రభుత్వం జూన్ నెలను “బాల కార్మిక వ్యతిరేక కార్యాచరణ మాసం” గా నిర్వహిస్తున్న నేపథ్యంలో చేపట్టబడింది. బాల కార్మికత్వంలో ఉన్న పిల్లలను గుర్తించడం, రక్షించడం, పునరావాసం కల్పించడం, బాలల అక్రమ రవాణాను నిరోధించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలు.రక్షించబడిన చిన్నారులు 10 నుండి 17 సంవత్సరాల మధ్య వయస్సు కలవారు. వీరు వివిధ వాణిజ్య సంస్థల్లో పని చేస్తూ, వారి శారీరక, మానసిక, విద్యా అభివృద్ధికి హానికరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు. ప్రాథమిక విచారణలో వీరు అధిక పని గంటలు, తగిన వేతనం లేకపోవడం, ప్రమాదకరమైన పని వాతావరణంలో పనిచేస్తున్నట్లు వెల్లడైంది.రక్షణ అనంతరం సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు ప్రారంభించబడ్డాయి.

అదేవిధంగా, పిల్లలకు పునరావాసం, విద్యలో తిరిగి చేర్పించడం, చట్టం ప్రకారం లభించే పరిహారం, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించే చర్యలు చేపట్టబడ్డాయి.రక్షణ కార్యక్రమాలతో పాటు, స్కోప్ సంస్థ వివిధ గ్రామాలు, సమాజాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ అధికారులు, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, యువజనులు పాల్గొని బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మికత్వం, బాలల అక్రమ రవాణా నివారణపై చైతన్యం పొందారు.ఈ సందర్భంగా స్కోప్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ బండి సాయన్న మాట్లాడుతూ "బాల కార్మికత్వం నుంచి రక్షించబడిన ప్రతి చిన్నారి తన విద్య, భద్రత, గౌరవప్రదమైన జీవన హక్కులను తిరిగి పొందుతున్నాడు. బాల కార్మికత్వం పిల్లల బాల్యాన్ని, భవిష్యత్తును దోచుకుంటుంది. ఏ చిన్నారి పనిస్థలంలో కాకుండా పాఠశాలలో ఉండాలి. బాల కార్మికత్వం నివారణ, బాలల అక్రమ రవాణా నిర్మూలన, రక్షించబడిన ప్రతి చిన్నారికి రక్షణ, పునరావాసం, మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు ప్రభుత్వ శాఖలు, చట్ట అమలు సంస్థలతో కలిసి నిరంతరం పనిచేస్తాము." అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జూన్ నెలను బాల కార్మిక వ్యతిరేక కార్యాచరణ మాసంగా నిర్వహిస్తున్నారు.

బాలల అక్రమ రవాణా, బాల కార్మికత్వం మధ్య ఉన్న బలమైన సంబంధాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా తనిఖీలు, రక్షణ చర్యలు, అవగాహన కార్యక్రమాలు, అక్రమ రవాణా నిరోధక కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తున్నాయి. స్కోప్ సంస్థ, దేశంలోనే అతిపెద్ద బాలల పరిరక్షణ నెట్వర్క్ అయిన జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) భాగస్వామ్య సంస్థగా పనిచేస్తోంది. 250కి పైగా భాగస్వామ్య సంస్థలతో కూడిన ఈ నెట్వర్క్ సమాచార భాగస్వామ్యం, రాష్ట్రాల మధ్య సమన్వయం ద్వారా బాలల అక్రమ రవాణా కేసులను గుర్తించి, పిల్లలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

ఏప్రిల్ 2023 నుండి మార్చి 2026 వరకు జేఆర్సీ నెట్వర్క్ భాగస్వామ్య సంస్థలు దేశవ్యాప్తంగా 1,45,000 మందికి పైగా పిల్లలను అక్రమ రవాణా నుంచి రక్షించాయి, వీరిలో ఎక్కువ మంది బాల కార్మికత్వంలోకి నెట్టబడిన వారే.

**ముఖ్యాంశాలు:**







- **బాల కార్మికత్వం నుంచి 6 మంది చిన్నారుల రక్షణ**
- **స్కోప్ సంస్థ, జిల్లా యంత్రాంగం, పోలీసుల సంయుక్త చర్య**
- **నిందితులపై చట్టపరమైన చర్యల ప్రారంభం**
- **పిల్లల పునరావాసం, విద్యలో తిరిగి చేర్పించే ప్రక్రియ కొనసాగింపు**
- **జిల్లాల వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాల నిర్వహణ**
- **బాలల అక్రమ రవాణా, బాల కార్మికత్వంపై మరింత కట్టుదిట్టమైన నిఘా.**

## ఎందుకీ లొంగుబాటు ధోరణి?

- **అమెరికా దాడిలో భారత నావికులు చనిపోయినా నోరు మెదపని ప్రధాని**

**న్యూఢిల్లీ :**


ఒమన్ సమీపంలో ఎంటీ మారివెక్స్, ఎంటీ సెట్టిబెల్లో, ఎంటీ జెల్వీర్ నౌకలపై అమెరికా సేనలు దాడులు జరిపిన విషయం తెలిసిందే. ఈ మూడింటిలోనూ మన దేశానికి చెందిన నావికులే ఉన్నారు. ఎంటీ సెట్టిబెల్లోపై జరిగిన దాడిలో ముగ్గురు నావికులు ప్రాణాలు కోల్పోయారు. అమెరికాతో భారత్ సంబంధాల విషయంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై ఈ దాడులు తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. భారత్ నిరసన వ్యక్తం చేసినప్పటికీ మన నావికులతో నడుస్తున్న వాణిజ్య నౌకలను అమెరికా లక్ష్యంగా చేసుకుంటోంది. దాడుల పైన, భారత నావికుల మరణం పైన అమెరికా సైన్యం కానీ, ట్రంప్ ప్రభుత్వం కానీ విచారం వ్యక్తం చేసిన పాపాన పోలేదు. భారత నావికులను అమెరికా సేనలు పొట్టనపెట్టుకోవడాన్ని ప్రధాని మోడీ కానీ, ఆయన మంత్రిమండలి సహచరులు కానీ ఖండించలేదు. విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది కానీ అందులో దాడికి పాల్పడిన వారి పేరును ప్రస్తావిం చకుండా జాగ్రత్త పడింది. 'మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న సంఘర్షణలకు ఈ దాడులు ప్రత్యక్ష ఫలితం' అంటూ తేలికగా తీసుకుంది.

రాజ్యాంగ బాధ్యతల ఉల్లంఘనే

భారత నావికుల మృతిపై నౌకాయాన మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేసి చేతులు దులుపుకుంది. ఈ పరిణామాలను గమనిస్తే మన రాజకీయ నాయకత్వం అమెరికాకు వ్యూహాత్మకంగా లంగిపోయినట్లు కన్పిస్తోంది. అమెరికా దాడిలో మరణించిన ముగ్గురు భారతీయ నావికుల మృతదేహాలను వెలికితీస్తున్న సమయంలోనే... ప్రధాని నరేంద్ర మోడీ 12 సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేసుకొని మైలురాయిని అధిగమించినందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభినందనలు తెలిపారు. దీనికి ప్రతిస్పందనగా మోడీ కూడా ఆయనకు కృతజ్ఞతలు చెప్పారు. అమెరికా సైనిక దాడులపై మోడీ ప్రభుత్వ మౌనాన్ని చూస్తుంటే దేశ పౌరుల ప్రాణాలను కాపాడుకోవాల్సిన నైతిక బాధ్యతను అది విస్మరించిందని అర్థమవుతోంది. అంతర్జాతీయ జలాలలో అమెరికా బలగాలు అమాయక భారతీయులను చంపుతున్నప్పుడు ప్రధాని మౌనం వహించడమంటే ఆయన తన రా జ్యాంగ బాధ్యతలను ఉల్లంఘించినట్లే అవుతుంది.

### నిరసన తెలిపినా ఆగని దాడులు

భారత విదేశాంగ శాఖ కార్యాలయం న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయ దౌత్యవేత్త జాసన్ మీక్స్‌ను పిలిపించింది. భారతీయ నావికులతో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై అమెరికా సైన్యం ప్రాణాంతక దాడులు చేయడం ఆమోదయోగ్యం కాదని తెలిపింది.




## ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి: కలెక్టర్

**తంగళ్ళపల్లి వెలుతురు జూన్ 13:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని గ్రామాలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా తంగళ్లపల్లి మండలం రామన్నపల్లి గ్రామంలోని ప్రగతి ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, పంటల మార్పిడి, వ్యవసాయ, బడి బాట, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, పారిశుద్ధ్యం, వన మహోత్సవం, జల సంరక్షణ, మహిళల రక్షణ, షి టీమ్, భరోసా కేంద్రం తదితర అంశాలపై గ్రామ ప్రజలతో సుదీర్ఘంగా చర్చించి అవగాహన కల్పించారు.గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి నాలుగు చెత్త బుట్టలు పంపిణీ చేయాలని, బట్ట సంచులు ఇవ్వాలని, గ్రామంలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేసి..

స్టీల్ ప్లేట్స్, గ్లాసులు, జగ్గులు ఇవ్వాలని ప్రతి వేడుకలకు వాటిని ఉపయోగించాలని ప్రతిపాదనలు చేశారు.వర్షాకాలానికి ముందే గ్రామాల్లోని డ్రైనేజీలు శుభ్రం చేయించాలని తెలిపారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దని కోరారు. ఘన వ్యర్థాల నిర్వహణ –2026 పై ప్రజలు కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని, చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలని సూచించారు. తడి, పొడి, సానిటరీ, ప్రత్యేక చెత్త గా వేరు చేసి గ్రామ పంచాయతీ వాహనానికి అందించాలని సూచించారు.సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్వహణపై అవగాహన పొందాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో గ్రామస్థులను సెగ్రిగేషన్ షెడ్లకు తీసుకు వెళ్లాలని సూచించారు. నీటి ట్యాంకులను నెలకు మూడు సార్లు బ్లీచింగ్ తో సిబ్బంది శుభ్రం చేయాలని ఆదేశించారు.

